13 నుంచి తిరుకల్యాణోత్సవాలు



ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల వేంకటేశ్వరస్వామి ఆశ్వయుజ మాస తిరుకల్యాణోత్సవాలు అక్టోబరు 13 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఈవో ఎన్వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. ఉత్సవాల సమయంలో స్వామివారి నిత్యార్జిత కల్యాణాలు, ఆర్జిత సేవలు ఉండవని పేర్కొన్నారు. స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని చెప్పారు. రాత్రి 7గంటలకు గజ వాహనంపై శ్రీవారి గ్రామోత్సవం ఉంటుందని పేర్కొన్నారు. 14న ధ్వజారోహణ, రాత్రి 9 గంటలకు శేష వాహనంపై గ్రామోత్సవం, 16న ఉదయం 7 గంటలకు సూర్య ప్రభ వాహనంపై గ్రామోత్సవం, రాత్రి 7కు ఎదుర్కోలు ఉత్సవం, 17న రాత్రి 8 గంటలకు స్వామివారి తిరుకల్యాణోత్సవం, వెండి గరుడ వాహనంపై గ్రామోత్సవం, 18న రాత్రి స్వామివారి రథోత్సవం, 19న ఉదయం చక్రస్నానం, రాత్రి శ్రీవారి ధ్వజా అవరోహణ, 20న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, పవళింపు సేవ చేయనున్నట్లు వెల్లడించారు.



భక్తులతో నిండిన శ్రీవారి దర్శన క్యూకాంప్లెక్స్

పొడగంటిమయ్యా.. పురుషోత్తమా..!

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: చిన వేంకన్న కొలువైన ద్వారకాతిరుమల శేషాచలం శనివారం భక్తులతో పోటెత్తింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి విశేష సంఖ్యలో తరలివచ్చి.. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. సామాన్య భక్తులు ఎక్కువ సమయం క్యూలలో వేచి ఉండాల్సి వచ్చింది. వృద్ధులు, దివ్యాంగులను ప్రత్యేక క్యూల ద్వారా దర్శనానికి అనుమతించారు.

తెలంగాణలో వర్షాల ప్రభావం


గోదావరిలో పెరుగుతున్న నీటిమట్టం

కుక్కునూరు, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రంలోని గోదావరి తీర ప్రాంతంలో రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలతో నదిలో మళ్లీ నీటిమట్టం పెరుగుతోంది. వాగులు, వంకలు ద్వారా నీరు చేరుతుండటంతో స్వల్పంగా పెరుగుతున్నట్లు చెబుతున్నారు. ఆ ప్రభావమే తప్ప, నదికి వరదలొచ్చే అవకాశాలు దాదాపు లేవని అధికారులు పేర్కొన్నారు.

పోలవరం ప్రాజెక్టు వద్ద.. **పోలవరం, న్యూస్‌టుడే:** పోలవరం ప్రాజెక్టు స్పిల్‌వే వద్ద శనివారం సాయంత్రానికి నీటిమట్టం 28.24 మీటర్లకు చేరింది. 48 గేట్ల ద్వారా 2.25 లక్షల క్యూసెక్కులు దిగువకు వెళుతున్నట్లు జలవనరులశాఖాధికారులు చెప్పారు.

బదిలీల్లో భారీగా దండుకున్నారు

రిజిస్ట్రేషన్ శాఖలో పెద్ద ఎత్తున వసూళ్లు



ఈనాడు, ఏలూరు, న్యూస్‌టుడే- భీమవరం అర్బన్

ఉమ్మడి పశ్చిమలో తాజాగా ముగిసిన బదిలీల్లో భారీగా అవకతవకలు జరిగాయి. చాలా శాఖల్లో అధికారులు చక్రం తిప్పారు. నచ్చిన చోటికి పంపేందుకు..ఉన్నచోటే ఉంచేందుకు ఉద్యోగుల నుంచి భారీగా దుండుకున్నారు. రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్, రెవెన్యూ.. ఇలా చాలా శాఖల్లో బదిలీల పేరుతో పెద్ద ఎత్తున వసూళ్లు చేశారు.

- ఏలూరు జిల్లాలోని ఓ ప్రధాన ప్రాంతంలో సబ్ రిజిస్ట్రార్ స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. అందరూ నాయకుల సిఫార్సు లేఖలు తెచ్చారు. దీంతో ఓ రాష్ట్రస్థాయి అధికారి దగ్గర పంచాయితీ జరిగింది. అందరితో మాట్లాడి ఎక్కువ ముడుపులిచ్చిన ఓ అధికారికి స్థానం కట్టబెట్టారు.
- పెంటపాడు మండలానికి చెందిన ఓ కార్యదర్శి అనారోగ్య కారణాలతో బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. నిబంధనల ప్రకారం వైద్యపత్రాలు కూడా ఆమె సమర్పించారు. కౌన్సెలింగ్ సమయంలో బదిలీ కావాలంటే ఖర్చవుతుందని డీపీవో కార్యాలయంలో ఓ ఉద్యోగి బేరంపెట్టారు. నాకు అన్ని అర్హతలు ఉన్నాయంటూ ఆమె డబ్బులు చెల్లించలేదు. దీంతో ఆమె కోరుకున్న స్థానంలో పని చేస్తోన్న కార్యదర్శి దగ్గర బేరం పెట్టారు. డబ్బులు ఇస్తే నువ్వే కొనసాగుతావ్ లేదంటే...ఇప్పటికే ఓ మహిళ దరఖాస్తు చేసుకున్నారని.. నీ స్థానంలోకి ఆమెను బదిలీ చేస్తామని చెప్పారు. దీంతో కంగారు పడి అతను రూ.30 వేలు ముట్టజెప్పారు.

ఏలూరు రేంజ్ పరిధిలోని ఉమ్మడి తూర్పు, పశ్చిమ, కృష్ణా జిల్లాల్లో సబ్‌రిజిస్ట్రార్, సీనియర్ సహాయకులు బదిలీల ప్రక్రియ ఏలూరులోనే నిర్వహించారు. కౌన్సెలింగ్ సమయంలోనే కొందరు తమకు నచ్చిన స్థానం ఇవ్వలేదని..అధికారులతో వాగ్వాదానికి దిగారు. బదిలీల ప్రక్రియపై అనేక ఆరోపణలు చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 27 సబ్‌రిజిస్ట్రార్ పోస్టులున్నాయి. వీటిలో కొన్ని ప్రధాన ప్రాంతాలకు బదిలీపై వెళ్లేందుకు కొందరు భారీగా ముడుపులు సమర్పించారు.

ఆ రెండు శాఖల్లో దందా

రెవెన్యూ, పంచాయతీ రాజ్ శాఖలో బదిలీలకు భారీగా వసూలు చేశారు. పంచాయతీరాజ్ శాఖలో ఓ అధికారి ముడుపులతో గల్లాపెట్టి నింపుకొని తాజాగా బదిలీపై వెళ్లిపోయారు. పంచాయతీ, సచివాలయ కార్యదర్శుల బదిలీల్లో కౌన్సెలింగ్‌లో ఆయనే స్వయంగా బేరాలు మాట్లాడారు. అన్ని అర్హతలున్నా..నాయకుల సిఫార్సు లేఖలున్నా ఆయన పట్టించుకోరు. పని జరగాలంటే చెయ్యి తడపాల్సిందే అన్నట్లు ఒక్కో బదిలీకి రూ.20-30వేల వరకు వసూలు చేశారు. రూ.లక్షల్లో మింగేశారు. రెవెన్యూ పరిధిలో డీటీలు, తహసీల్దార్, వీఆర్వో ఉద్యోగాల విషయంలో నరసాపురంలో భారీగా వసూళ్లు జరిగినట్లు తెలిసింది.

జారుకుంటున్న అక్రమార్కులు

భీమవరం పురపాలికలోని కీలక శాఖలో అధికారి గత అయిదేళ్లు వైకాపాకు భక్తుడిలా పని చేశారు. స్థానిక నేతల అండతో భారీగా వెనకేసుకున్నారు. కుంభకోణాలన్ని బయట పడతాయన్న ఉద్దేశంతో దాదాపు రూ.5 లక్షలు ఖర్చు పెట్టి విశాఖకు బదిలీ చేయించుకున్నారు. ఇలా ఉమ్మడి జిల్లాలో అన్ని శాఖల్లో అక్రమాలకు పాల్పడిన అధికారులున్నారు. అప్పటి నేతల మాటలు నెత్తిన పెట్టుకుని ఊరేగారు. ప్రభుత్వం మారటంతో వేటు తప్పదనుకున్న తరుణంలో బదిలీల జాతర వచ్చింది. సందట్లో సడేమియా అన్నట్లు చాలా మంది భారీగా ఖర్చుపెట్టి జారుకున్నారు.

కలెక్టరేట్‌లో విభాగాల తనిఖీ



ఓ విభాగంలో దస్త్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టరేట్‌లోని వివిధ విభాగాలను శనివారం కలెక్టర్ వెట్రిసెల్వి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల విధులకు సంబంధించిన అంశాలను పరిశీలించారు. పక్కాగా దస్త్రాలు నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. ఎస్టాబ్లిష్‌మెంట్, ల్యాండ్ అండ్ రెవెన్యూ, ప్రొటోకాల్, ఎన్నికలు, కో-ఆర్డినేషన్ తదితర విభాగాలను ఆమె పరిశీలించారు. కలెక్టర్ కార్యాలయ ఆవరణలోని సత్యసాయి వాటర్ ప్లాంటు నిర్వహణ తీరును పరిశీలించారు. కలెక్టరేట్‌లో ఏవో కార్యాలయం ఎదురుగా ఉన్న వాటర్ ఫిల్టర్‌కు మరమ్మతులు చేయించాలని ఆదేశించారు.

30న ఉద్యోగ మేళా

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 30న జంగారెడ్డిగూడెంలోని స్కిల్ హబ్‌లో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి మధుభూషణరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ తదితర కోర్సులు చదివి 18 నుంచి 30 సంవత్సరాల వయసు కలిగిన వారు హాజరు కావచ్చన్నారు.

ఉంగుటూరు రైల్వే గేటు మూత

ఉంగుటూరు, న్యూస్‌టుడే: అత్యవసర ట్రాక్ మరమ్మతుల నిమిత్తం ఉంగుటూరు రైల్వే గేటును శనివారం నుంచి తాత్కాలికంగా మూసివేశామని తాడేపల్లిగూడెం రైల్వే సీనియర్ ఇంజినీర్ ఎస్‌వీకే వర్మ తెలిపారు. వచ్చేనెల 5వ తేదీ వరకు గేటు మూసి ఉంటుందన్నారు.

అయిదేళ్లలో అధరహో!

కొబ్బరికి భారీగా గిరాకీ ☛ వెయ్యి కాయలు రూ. 17 వేలు

- ఉమ్మడి జిల్లాలో కొబ్బరికి డిమాండ్ పెరిగింది. 2019 తర్వాత దాదాపు అయిదేళ్లలో ఎన్నడూ లేనంత రికార్డు స్థాయికి ధరలు పెరిగాయి. కేవలం 20 రోజుల వ్యవధిలోనే వెయ్యి కొబ్బరి కాయల ధర రూ.13 వేల నుంచి రూ.17 వేలకు ఎగబాకింది. తగ్గిన దిగుబడులు పెరిగిన పెట్టుబడులతో దిగాలు చెందుతున్న కొబ్బరి రైతులు చాలా రోజుల తర్వాత గిట్టుబాటు ధరలు రావడంతో ఉత్సాహంగా దింపులు చేయిస్తూ, కాయలను మార్కెట్‌కు తరలిస్తున్నారు.



పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోనే కొబ్బరికి పెద్ద మార్కెట్‌గా పాలకొల్లు కొనసాగుతుంది. 2022-23 సమయంలో రోజుకు 25 నుంచి 30 లారీల సరకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతులయ్యేది. ప్రస్తుతం పెరిగిన ధరలతో రోజుకు 50కు పైగా లారీలు పాలకొల్లు నుంచి ఇతర రాష్ట్రాలకు ఎగుమతవుతున్నాయి. లారీకి 38 వేల నుంచి 40 వేల కొబ్బరికాయలు ఎగుమతి చేస్తుంటారు. ఈ లెక్కన ఒక్క పాలకొల్లు నుంచే నిత్యం 20 లక్షల కొబ్బరికాయల ఎగుమతి జరుగుతోంది. ఇదే నియోజకవర్గంలోని యలమంచిలి మండల కేంద్రం నుంచి రోజుకు 10 లారీల సరకు ఎగుమతి చేస్తున్నారు.

జిల్లా	కొబ్బరి విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
ఏలూరు	35,500	25,350
పశ్చిమ	14,000	9,800

దిగుబడులు లేకనే... ప్రకృతి వైపరీత్యాల కారణంగా తమిళనాడు, కేరళ, కర్ణాటకల్లో దిగుబడులు గణనీయంగా తగ్గడమే ధరలు పెరగడానికి కారణమని యలమంచిలికి చెందిన ప్రముఖ కొబ్బరి వ్యాపారి కాసా సత్య తెలిపారు. పెద్దసైజు వెయ్యింటికి రూ.17 వేలు, మధ్యరకం రూ.15 వేలు, చిన్న సైజు కాయలు రూ.13 వేలు ధర పలుకుతున్నాయన్నారు.

ఉమ్మడి జిల్లా నుంచి ఎక్కువగా మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, రాజస్థాన్ రాష్ట్రాలకు ఎగుమతులు జరుగుతుంటాయి. దసరా, దీపావళి సీజన్‌లో ఏటా ధర పెరుగుతుంది. ఈ ఏడాది సీజన్‌కు ముందే పెరగడంతో దీపావళి నాటికి వెయ్యింటి ధర రూ.20 వేలకు చేరవచ్చనే ఆశాభావం వ్యక్తమవుతుంది. ఎగుమతులు డీలా పడటంతో లక్షమందికి పైగా ఉన్న దింపు, ఒలుపు కార్మికులు ఉపాధి కోల్పోయారు. ప్రస్తుతం వీరికి చేతినిండా పని లభిస్తుంది.

పంచాయతీ కార్యదర్శుల బదిలీలు

ఏలూరు గ్రామీణ, వన్‌టౌన్ న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గ్రేడ్ 1, 2 పంచాయతీ కార్యదర్శులు 153 మంది బదిలీ అయ్యారు. ఈ మేరకు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో గ్రేడ్ 1 కార్యదర్శులు 131 మంది కాగా 22 మంది గ్రేడ్ 2 కార్యదర్శులున్నారని డీపీవో శ్రీనివాస్ విశ్వనాథ్ తెలిపారు. ఈ మేరకు బదీల ఉత్తర్వులను కార్యదర్శులకు అందజేశారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు సిద్ధం చేయండి



రైతులతో మాట్లాడుతున్న అజీర్ జిలాని సమూన్

గణపవరం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్‌కు ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను సిద్ధం చేయాలని పౌరసరఫరాల సంస్థ ఎండీ అజీర్ జిలాని సమూన్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కేశవరం రైతు సేవా కేంద్రాన్ని శనివారం ఆయన జేసీ రాహుల్ కుమార్‌రెడ్డితో కలిసి సందర్శించారు. రైతులు పండించిన ధాన్యాన్ని ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని జిల్లా, మండల అధికారులకు సూచించారు. గత ప్రభుత్వ హయాంలో రవాణా పరంగా ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు రైతులు సమూన్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం వారు వరదరాజపురంలోని రైస్ మిల్లును పరిశీలించారు. కార్యక్రమంలో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరాం ప్రసాద్, డీఎస్‌వో ఎన్.సరోజ, జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు, ఆర్డీవో ఉమామహేశ్వరరావు, జిల్లా మార్కెటింగ్ అధికారి నాగ రాజారావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆబ్కారీలో సిఫార్సు లేఖల జోరు

మితిమీరుతున్న రాజకీయ జోక్యం

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆబ్కారీ శాఖకు పూర్వవైభవం తీసుకొచ్చే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనిలో భాగంగా ఎస్ఈబీని రద్దు చేయడంతో పాటు ఇరు జిల్లాలకు ఆబ్కారీ స్టేషన్లు కేటాయించారు. ఆయా స్టేషన్లలో కొలువులకు తీవ్ర పోటీ నెలకొనడంతో నాయకుల సిఫార్సు లేఖలకు నజరానాలు చెల్లించుకోవాల్సిన పరిస్థితులు కొన్ని చోట్ల నెలకొన్నాయి. ఈ వ్యవహారంలో కొందరు ద్వితీయశ్రేణి నాయకులు, గతంలో వైకాపాతో అంటకాగిన మధ్యవర్తులు చక్రం తిప్పుతున్నారు.

అనుకూలమైనవారైతేనే.. ఏలూరు జిల్లాలో పోలవరం, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, కైకలూరు, ఏలూరు, భీమడోలు, నూజివీడు, పశ్చిమగోదావరిలో ఆకివీడు, భీమవరం, పాలకొల్లు, తణుకు, తాడేపల్లిగూడెం, నరసాపురాల్లో ఆబ్కారీ స్టేషన్లు ఉన్నాయి. ఆయా స్టేషన్లకు సీఐ, ఇద్దరు ఎస్సైలు, ఇద్దరు, ముగ్గురు హెడ్‌కానిస్టేబుళ్లు, 8 నుంచి 10 మంది చొప్పున సిబ్బంది, ఈఎస్‌టీఎఫ్ అధికారులను నియమిస్తారు. వీరి నియామకాలకు సంబంధించి కొన్ని నియోజకవర్గాల్లో రాజకీయ జోక్యం మితిమీరినట్లు సమాచారం. మద్యం వ్యాపారం అనుకూలంగా సాగాలంటే సహకరించే అధికారులు, సిబ్బంది ఉంటేనే సాధ్యమనే యోచనతో సీఐ నుంచి సిబ్బంది వరకు అనుకూలమైన వారి పేర్లను మాత్రమే పరిశీలిస్తున్నట్లు సమాచారం. మరోపక్క బాగా సొమ్ములొచ్చే స్టేషన్లలో పోస్టింగుల కోసం సిఫార్సు లేఖకు కొంత నజరానాను ఆయా నియోజకవర్గాల్లో ద్వితీయశ్రేణి నాయకులు, ముఖ్యనాయకుల అనుయాయులు తీసుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

EENADU Classifieds

AGRI BUSINESS

"గోశాల గోవుల కోసం" వరిగడ్డి (ఎండుగడ్డి) కట్టలు 500 టన్నులు కొనబడును. వివరాలకు సంప్రదించండి సెల్. 7702542788, 9392752788.

ఆక్వాటెక్ గ్రూప్ ఉత్పాదనలు R.K FEEDS Golden Bay - Asian Aqua - AB Chemicals మేతలు మరియు మందుల తయారీదారులకు కావలసిన ముడిపదార్థములు, ప్రొబయోటిక్స్, గ్రోత్ ప్రమోటర్స్, శానిటైజర్లు, ఆక్సిజన్ ఉత్పత్తులు, మినరల్ సాల్ట్స్, మైక్రోమినరల్స్, ప్లాంక్టన ఉత్పత్తులు హెర్బల్ శానిటైజర్లు, విదేశీ వైట్‌గట్ మందులు సరఫరా చేయబడును. మార్కెటింగ్ చేయుటకు స్టాఫ్ కావలెను. (ఆక్వాటెక్ గ్రూప్). Contact: 94935 27999.

నరసాపురం దగ్గర్లో 18 ఎకరాల రొయ్యల చెరువు కరెంటు, పైపులైన్ సౌకర్యాలతో లీజుకు ఇవ్వబడును. Cont: 96520 55168

POULTRY

జంగారెడ్డిగూడెం దగ్గర సింగరాయపాలెంలో 33 వేలు కోళ్ళఫారం అద్దెకు ఇవ్వబడును. సంప్ర॥ 98666 67341.

AUTO

VEHICLES FOR SALE

★2019 **టాటా** మోడల్ ఎక్స్‌ప్రెస్ బస్సు ★2020 **అశోక్** లేలాండ్ స్లీపర్ (వెన్నెల) బ్యాంక్ వారి వేలం ద్వారా అమ్మబడును. వివరములకు ✆ 90301 61117.

BUSINESS SERVICES

BUSINESS OFFER

మహిళలు, నిరుద్యోగులు, చిన్న పెట్టుబడితో హోమ్ బేస్డ్ ప్రొడక్ట్స్ బిజినెస్ ద్వారా ప్రతినెల ఫిక్స్‌డ్ సంపాదన పొందండి. ✆ 7013544075, 7842877904.

మార్టిగేజ్, ఆస్తులు, సెక్యూర్డ్ ప్రాపర్టీలకు, చిన్న, పెద్ద మొత్తాలలో ఫైనాన్స్ చేయుటకు ఆర్థిక అనుభవం కలిగిన ఇన్వెస్టర్ /ఫైనాన్షియర్ కొరకు. Ph: 9642169934

BUILDING CONSTRUCTION

WATER PROOFING

తరుణ్ స్లాబ్ లీకేజీ వర్క్స్ ★25 సం॥ల అనుభవం ★5 సం॥ల గ్యారంటీతో వర్క్స్ చేయబడును. ★బాత్‌రూమ్ లీకేజీకి గ్రౌటింగ్ ఎపాక్స్ పెట్టబడును. ✆ 94940 02285, 99516 07504.

WOOD

377 **టేకుచెట్లు** 3 అడుగుల నుండి 5 అడుగుల చుట్టు కొలత గల నాణ్యమైన టేకు చెట్లు అమ్మకమునకు కలవు. నూజివీడు Contact. ✆ 98484 70700.

HOME NEEDS

PEST CONTROL

తరుణ్ పెస్ట్ కంట్రోల్ ★25 సం॥ల అనుభవం ★5 సం॥లు గ్యారంటీతో ★వాసనలేని ★మరకలు పడని బేయర్ కెమికల్స్‌తో ★చెదలు, బొద్దింకలు నివారణ. ✆ 94940 02285, 99516 07504.

INDUSTRY

MACHINERY FOR SALE

GEN Samrat హార్వెస్టింగ్ మెషీన్లు, హైడ్రాలిక్, పంపులు, గేర్ బాక్స్‌లు, మోటార్లు, వరికోత మెషీన్లు, విడి భాగాలు. కియరెన్సు సేల్ 50% Dis. Ph:9246249543, 9000688888

For Sale / అమ్మకము
మంచి రన్నింగ్ కండీషన్‌లో ఉన్నటువంటి AAC (లైట్ వెయిట్) బ్రిక్స్ ప్లాంట్ అమ్మకమునకు కలదు.
భూమి-1 ఎకరం,
కెపాసిటీ : 2000 బ్రిక్స్ (రోజుకు 2,000 బ్రిక్స్ వస్తాయి).
ఫ్యాక్టరీ షెడ్ - 125'X65' (8125 Sq.Ft),
125 KVA Generator,
ఆఫీసు రూమ్స్- 12X15-2,
వర్కర్స్ రూమ్స్- 10X10-3
అడ్రసు: విజయరాయి (గ్రా), పెదవేగి (మం), ఏలూరు జిల్లా
94400 79555
93475 96966

REAL ESTATE

గుంటూరు సిటీలో, గోరంట్ల, లాం, JKC రోడ్ ఇన్నర్‌రోడ్, వెనిగండ్ల, పెదకాకాని, నంబూరు, కాజ, మంగళగిరి, తాడికొండ, రాజధానిలోని, ప్లాట్లు అమ్మదలచినవారు సంప్రదించండి. 93999 55545.

FLAT FOR SALE

ఏలూరు మినీబైపాస్ K.K. రాజు గ్రీన్‌సిటీలో గ్రీన్‌స్పేస్ అపార్ట్‌మెంట్ నందు తూ॥ఫే॥ గల 2BHK లగ్జరీ ఫ్లాట్స్ (1461 SFT, 1323 SFT) అన్ని వసతులతో అమ్మకమునకు కలవు. బ్యాంక్‌లోన్ సదుపాయం కలదు. కప్‌బోర్డ్స్, హోమ్ ఆటోమిషన్. ✆ 95252 83848.

ఏలూరు R.R. పేట సుబ్బమ్మదేవి స్కూల్ దగ్గర Ravi plaza అపార్ట్‌మెంట్ నందు 2BHK ఫ్లాట్ అన్ని వసతులతో అమ్మకమునకు కలదు. ✆ 94400 79555.

ఏలూరు తంగెళ్ళమూడి, మావయ్యగారితోట సూర్య కళ్యాణ మండపం ప్రక్కన పార్వతి ప్యారడైజ్ నందు 1200 Sft 2 BHK ఫ్లాట్స్ అమ్మకమునకు కలవు. ✆ 94401 88188, 95539 66666.

భీమవరం పట్టణం, సెయింట్ మేరీస్ స్కూల్ ప్రక్కన, STR ప్లాజా 3rd Floorలో 1500 Sft. East Facing 3 BHK Flat అమ్మకమునకు కలదు. Cont: 94 94 95 56 78.

HOUSE FOR SALE

337 Sq.yds East facing Independent house, Chanikyapuri colony 2nd street, Eluru Very near to Dmart and center. Contact: 9866086719.

ఏలూరు పెద్ద రైల్వేస్టేషన్ దగ్గరలో మంచెం ఎస్టేట్స్ నందు 315 చ॥గ॥ తూర్పు ఫేసింగ్ గల 3BHK ఇండిపెండెంట్ హౌస్ అన్ని వసతులతో అమ్మకము. ✆ 98483 60622.

ఏలూరు బీడీ కాలనీ క్రాంతినగర్‌లో ఉ॥ఫే॥లో 150 చదరపు గజాల్లో గల న్యూ 2BHK ఇండిపెండెంట్ హౌస్‌లు రెండు అమ్మకమునకు కలవు. ✆ 90630 30268.

ఏలూరు శనివారపుపేట దుగ్గిరాల మెయిన్‌రోడ్డుకి అతి సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న 2BHK ఇండివిడ్యువల్ బిల్డింగ్స్ ఈస్ట్ / వెస్ట్ ఫేసింగ్‌తో అమ్మకం. ✆ 9948847689, 9553511126.

రాజమండ్రిలో RUDA Layoutలో 150 చ॥గ॥, 2 BHK ఇల్లు కేవలం 33 లక్షలు ★ ★ ★కొవ్వూరు ఊరులో Ruda Layoutలో గజం 9999/-, 90% బ్యాంకు లోన్ సదుపాయం కలదు. ✆ 94913 17063.

LAND FOR SALE

Jangareddy Gudem, 45 Acres Land available for Sale/ Development with Palm oil Trees. Contact 7337335254.

Commercial Vacant Land Development in the extent of 0.98 Cents, NH Road, Sanivarapupeta, Eluru, West Godavari. West: NH 5 Bypass Road & Sabari Ashrama Seva Sangham. Ph: 7337335254.

Commercial Land Development to the extent of 3 Acre 31 Cents at R.S 12/1A, 12/1B & 12/1C, NH Road, Sanivarapupeta, Eluru. East: NH 5 Bypass Road & Sabari Ashrama Seva Sangham. Ph: 7337335254.

కోకో, కొబ్బరి, వరి, పామాయిలు తోటలు మరియు ఇండస్ట్రీయల్‌కు ఉపయోగపడే ల్యాండ్స్, అమ్మాలన్నా, కొనాలన్నా సంప్ర: ✆ 62810 03074.

PLOT FOR SALE

Eluru, Vidya Nagar, Shanivarapupet, Plot No.13, 211 Sq.Yds Plot For Sale. North Facing. Contact: 9848109049

Jangareddy Gudem Town 3200 Square Yards for Sale/ Development. Contact 7337335254.

3000 Sq. Yds Plots for Sale at Thangellamudi Village, Eluru (M), Eluru Dt., Contact: 7337335254.

తాడేపల్లిగూడెం RTC డిపో వెనుక FCI కాలనీ రోడ్ నెం.6 ఎదురుగా లే-అవుట్లైన 300 చ.గ. E/W ప్లాట్లు అమ్మకము. రేటు గజం 24 వేలు ఫిక్స్. స్పాట్ రిజిస్ట్రేషన్. ✆ +91 951 560 7213, +181 4862 8509 (Whats App).

ఏలూరు కొత్తూరు రోడ్ సుబ్రహ్మణ్య కాలనీలో సన్‌సిటీ- 1 దగ్గర తూ.ఫే. 800 చ.గ.ల స్థలం అమ్మబడును. ✆ 98486 22992.

ఏలూరు- కొత్తపేట దాసరివారి వీధిలో ఈస్ట్‌ఫేస్ 158 గ॥లు, సౌత్‌ఫేసింగ్ 7.5 గ॥లు మొత్తం 165.5 గ॥లు స్థలం అమ్మకము. ✆ 63093 70495, 77939 74822.

తణుకు, సజ్జాపురం, ఏపుళ్ళమ్మ గుడి దగ్గర 48 గజాల వెస్ట్ ఫేసింగ్ స్థలం అమ్మబడును. మరిన్ని వివరములకు: ✆ 81215 57299.

తాడేపల్లిగూడెం రేలంగి చిత్రమందిర్ కాంప్లెక్స్ వెనుక భాగ్యలక్ష్మి పేటలో శ్రీ కల్కిమూర్తి అపార్ట్‌మెంట్ దగ్గర 60 అ॥ రోడ్‌కు చేర్చి ద॥ఫే॥ 1380 చ॥గ॥ స్థలం అపార్ట్‌మెంట్స్, స్కూల్, కాలేజ్, హాస్పటల్, గొడౌన్స్‌కు అనువైనది అమ్మకం. సెల్: 98665 29233.

ఏలూరు వట్లూరు హౌసింగ్‌బోర్డ్ కాలనీలో 198 చ॥గ॥ స్థలం అమ్మకమునకు కలదు. గజం 9500/- (నెగోషియబుల్). కాంటాక్ట్: 86399 41614, 94902 91314.

ప.గో. జిల్లా ఏలూరు మండలం వెంకటాపురం పంచాయతీలో రెండు 250 గజాల స్థలాలు E/F అమ్మకమునకు కలవు. నో బ్రోకర్స్ ప్లీజ్. ✆ 9515666111.

ఏలూరు- తంగెళ్ళమూడి- లక్ష్మీనగర్‌లో JMJ స్కూల్ వెనుక 150 గ॥లు తూర్పుఫేస్, తూర్పు, దక్షిణం రోడ్‌గల స్థలం అమ్మకము. ✆ 98664 27534.

ఏలూరు జిల్లా కొయ్యలగూడెం పశువుల హాస్పటల్ ఎదురుగా కాలేజి రోడ్డులో తూర్పు, దక్షిణం రోడ్డు గల 12 1/2 సెంట్లు విడిగా గాని ఏక మొత్తముగా గాని అమ్మబడును. ✆ 88851 17288, 98480 31291.

పగోజి తణుకు నడిబొడ్డులో గ్రూప్ హౌస్‌లకి అనువైన 292 గజాల ఇళ్ల స్థలం రైల్వే స్టేషన్ రోడ్డుకి దగ్గరలో అమ్మకం డైరెక్ట్ ఓనర్ 8121460643, whatsapp 8333839898

జంగారెడ్డిగూడెం చిదంబరం హాస్పటల్ రోడ్‌లో నార్త్‌ఫేసింగ్ 350 గ॥, 240 గ॥ స్థలములు DLPO ఆఫీస్ వద్ద, రాజారావు గారి గొడౌన్ ప్రక్కన ఉత్తరం రోడ్‌గల 600 చ॥గ॥ అమ్మకం. ✆ 63051 85286.

భీమవరం నుండి పాలకొల్లు హైవే రోడ్డు ప్రక్కన, లంకలకోడేరు గ్రామ పంచాయతీ జిల్లా పరిషత్ పాఠశాల ఎదురుగా గల వెంచర్లో ప్లాట్ అమ్మకానికి కలదు. Ph: 9000966096

ఏలూరు, విజయలక్ష్మి థియేటర్ ప్రక్కలైను, నాగేంద్ర కాలనీ, గవర్నమెంట్ స్కూల్ ప్రక్కన 310 చ॥గజాల తూర్పు, పడమర ఫేసింగ్ స్థలం అమ్మకమునకు కలదు. Cont: 93947 71115.

ఏలూరు- క్రాంతినగర్‌లో 300 గ॥లు, పత్తేబాద- పెద్ద శివాలయం వెనుక, D. మార్ట్, సౌత్ ఇండియా దగ్గర, మరకా వారి వీధిలో 278 గ॥లు స్థలం అమ్మకము. ✆ 94414 11080.

స్థలము అమ్మకము
భీమవరం సింహాద్రి అప్పన్న గుడి నుండి కిరాణ మర్చంట్స్ పంక్షన్ హాల్‌కు వెళ్ళే 40 అడుగుల రోడ్‌ను ఆనుకుని (నార్త్ ఫేసింగ్) 10 సెంట్ల స్థలము అమ్మబడును.
95507 29543
89789 77128

COMMERCIAL SPACE FOR SALE

ఏలూరు దగ్గరలో జంగారెడ్డిగూడెం రోడ్డుకు తూర్పు ఫేసింగ్ కమర్షియల్ స్థలం అమ్మకమునకు కలదు. Ph: 95427 52999.

LEASE/ RENT

పొలము లీజుకు ఇవ్వబడును
రాజానగరం, మురారి నందు హైవేని ఆనుకుని 5 ఎకరముల పొలము కమర్షియల్‌కి లీజుకి ఇవ్వబడును.
85005 23456

LEASE/ SALE

ముదినేపల్లి మం॥ సింగరాయపాలెంలో బావాజీమఠం గుడి ఎదురుగా 200 చ॥గ॥ల్లో అన్ని సౌ॥తో నిర్మించిన కమర్షియల్ బిల్డింగ్. సేల్/లీజుకు కలదు. సంప్ర ✆ 98662 82619

TO LET

ఏలూరు R.R. పేట ముబుకుట్ల వారి వీధిలో రమేష్ హాస్పిటల్ ఎదురుగా శ్రీసాయి బాలాజీ ఎన్‌క్లేవ్ నందు 2BHK ఫ్లాట్ (నెం: 207) అద్దెకు కలదు. వాట్సప్ కాల్/మెసేజ్: ✆ +91 94408 87887.

ఏలూరు అశోక్‌నగర్- గంగానమ్మగుడి దగ్గర శ్రీవల్లీ అపార్ట్‌మెంట్‌లో 3A 3BHK ఫ్లాట్ అన్ని వసతులు గలది అద్దెకు కలదు. ✆ 98485 54729.

తణుకు కోర్టు ఎదురుగా అలమూరి వారి వీధి, కోస్టల్ బ్యాంక్‌పైన 3rd ఫ్లోర్‌లో తూ॥ఫే॥ 3 BHK ఫ్లాట్ లిఫ్ట్ సౌకర్యంతో అద్దెకు కలదు. (నో కార్ పార్కింగ్). ✆ 98661 00863, 92997 04018.

COMMERCIAL

Hospital Building For Rent Near Old Bus Stand Eluru. Ph: 9848112379, 8106799778

ఏలూరు- R.R. పేట- కస్తూరివారి వీధిలో భారత్ గ్యాస్ ఎదురుగా 800 Sft బిల్డింగ్‌లో 3rd ఫ్లోర్ వ్యాపార సంస్థలకు అద్దెకు కలదు. ✆ 97040 52626.

ఏలూరు RR పేట అగ్రజ్ ప్లాజా షాపింగ్ కాంప్లెక్స్‌లో మెయిన్‌రోడ్ ఫేసింగ్ 11.5X33 అ॥ కొలతలు గల షాపు అద్దెకు ఇవ్వబడును. ✆ 92461 95969.

JOBS

Wanted Sony TV Installation Engineers at Bhimavaram & Palakollu, W.G Dist. Contact: 97048 87799, 98485 77722.

Wanted Specialist Doctors work with Hospital Management, Physician, Laproscopic Surgeon, Lady Gynocologist (DGO). Cont: 94410 62166.

45 సం॥లు వయస్సు పైబడిన పాస్‌పోర్టు కలిగి ఉండి ఇంటిపని వంటపని చేయుటకు గాను ఒక మహిళ కావలెను. సంప్ర॥ 8523099305.

ఒక ప్రముఖ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో సీనియర్ అకౌంటెంట్‌గా వర్క్ చేయుటకు అర్హతగల అభ్యర్థులు కావలెను. ఆసక్తికలవారు సంప్రదించండి. రాజమండ్రి సెల్: 92466 49156.

ఏలూరులో యాడ్స్ సంస్థకు పనిచేయుటకు వర్క్స్ సూపర్‌వైజర్లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, కంప్యూటర్ ఆపరేటర్స్ మరియు డ్రైవర్లు (బొలెరో) కావలెను. సంప్ర॥ ✆ 99634 71011, 99634 71015.

డిజిటల్ ప్రింటర్స్ నందు ఉచిత శిక్షణ ఇచ్చి ఉద్యోగం ఇవ్వబడును. హైదరాబాద్‌లో Min. Comp. నాలెడ్జ్ ఉండవలెను. పురుషులు మాత్రమే సంప్రదించండి. ✆ 9989374446.

ఏలూరులో MNC కంపెనీలో వర్క్‌చేయుటకు M/F ఎంప్లాయిస్ కావలెను. Q: డిగ్రీ, 25Y-35Y, బైకమస్ట్ ఆకర్షణీయమైన జీతం. అనుభవజ్ఞులైనవారు వెంటనే సంప్రదించండి. సెల్: ✆ 98669 34448.

పెదవేగి మండలం కొప్పుల వారి గూడెంలో శ్రీ విజయసూర్య పాలిమర్స్ నందు జాబ్ చేయుటకు MPC, BiPC, B.Tech, Tally గల వారు కావలెను. సంప్ర: 94406 64448, 88855 20777.

WANTED
శ్రీరామ్ ఫైనాన్స్ (ప్రై)లి॥,
ఏలూరు,తణుకు,చింతలపూడి బ్రాంచీల నందు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్, కలెక్షన్ ఏజెంట్స్‌గా పనిచేయుటకు ఉత్సాహ వంతులైన యువకులు కావలెను.
విద్యార్హత : ఇంటర్ / డిగ్రీ
వయస్సు : 28 సం॥ లోపు.
ఇంటర్వ్యూ తేది: ది.30.09.2024
ఉ॥10 గం॥ల నుండి
ఆకర్షణీయమైన జీతం + ఇన్సెంటివ్స్.
అడ్రస్
శ్రీరామ్ ఫైనాన్స్ (ప్రై)లి॥
వసంత మహల్ బ్యాక్‌సైడ్ ఏలూరు
Cell : 6304 187509, 76708 78230

ఏలూరు మెయిన్ బజార్ మెడికల్ షాపు నందు పని చేయుటకు స్త్రీ పురుషులు కావలెను. మంచి జీతం ఇవ్వబడును. సంప్ర: ✆ 94403 42947.

జంగారెడ్డిగూడెం మోహన్‌సాయి బజాజ్ షోరూమ్‌లో పని చేయుటకు వర్క్‌షాప్ సూపర్‌వైజర్, స్పేర్స్ ఇన్‌ఛార్జ్, అకౌంటెంట్ కావలెను. ✆ 96669 69611.

రామకృష్ణ ఓల్డేజ్‌హోం Hyd, VJA బ్రాంచిల కొరకు 10th ఆపైన చదివిన 20-50 సం॥ల స్త్రీ/పు టెలికాలర్స్, కస్టమర్ కేర్ సూపర్‌వైజర్లు, అడ్మిన్లు, మేనేజర్లు, అకౌంటెంట్లు, బైక్ మెకానిక్‌లు కావలెను. భో+ వ+ మంచి జీతం. 9441381122, 9440841122.

నాని (Nanny) USA లో పనిచేయుటకు ఏ బాదరబందీ లేని వీసా కలిగిన 40-50 సం॥ ఆడమనిషి కావలెను. వసతి కల్పించబడును. ✆ 9440757004.

VISA **ఉన్న** ఆయా (Age 40 సం॥ - 50 సం॥) కావలెను. అమెరికాలోని అట్లాంటలో పనిచేయుటకు బాదర బందీలేని వారు కావలెను. 93464 41024.

హరేకృష్ణ హోంకేర్ విజయవాడ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం: 18k. ✆ 96405 28899, 96406 48899.

Hyd **లో** 24 గం॥ శ్రీమంతుల ఇళ్లలో పనిచేయుటకు Exp. భార్యాభర్త కపుల్స్ కా॥ భర్త, మగ పేషెంట్‌కి సేవ, భార్య ఇంటి, వంటపనికి (30-40 సం॥). జీ: 28-32 వేలు+ రూం ఫ్రీ. ✆ 9849053822.

త్రినేత్ర హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను / పేషంట్స్ / చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం కలదు. జీతం. 18 K. ✆ 85209 80099, 85208 74499.

మచిలీపట్నం, భాస్కరపురం నందు ముగ్గురికి వంటపని, ఇంటిపని చేయుటకు ఏ బాదరబందీ లేని 40 సం॥ వయస్సు గల ఆడమనిషి పనిచేయుటకు కావలెను. ✆ 70136 19109.

హైదరాబాద్ దిల్‌సుఖ్‌నగర్‌లో బ్రాహ్మణ స్త్రీలు మాత్రమే బ్రాహ్మణ కుటుంబంనందు అక్కడే ఉండి వంటకు స్త్రీలు (ఇద్దరు) మరియు కేర్‌టేకర్ కావలెను. Ph: 9866252220.

హైదరాబాద్‌లో 24 గంటలు ఇంటి వద్దనే ఉంటూ ఇంటిపని లేదా చిన్నపాపను చూసుకొనుటకు హిందీ, తెలుగు భాష వచ్చిన మహిళ కావాలి. జీ: 18,000/- ✆ 7670979317.

దక్షిణ భారతదేశంలో ప్రముఖ చేపల రొయ్యల తయారీ ISO సర్టిఫైడ్ కంపెనీకి పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం; కైకలూరు; ఆకివీడు; గణపవరం హెడ్ క్వార్టర్స్‌గా మా ఉత్పత్తులను మార్కెటింగ్ చేయుటకు అనుభవం గల పురుష అభ్యర్థులు కావలెను. లోకల్ వారికి ప్రాధాన్యత. ఆకర్షణీయమైన జీతం & అలవెన్సులు ఇవ్వబడును. 2 వీలర్ తప్పనిసరి. సంప్రదించండి: Ultra Tech Minerals, Guntur. Mail: ultratechminerals.gnt@gmail.com, Ph: 98482 45626 & 95733 08158. గమనిక: ఆక్వారంగంలో అనుభవం కలిగిన అభ్యర్థులు మాత్రమే సంప్రదించవలెను.

దుర్గ శ్రీనివాస హోంకేర్ సర్వీస్ TS & AP. మంచానున్న వృద్ధులు, పేషెంట్లను, బేబీకేర్ ఇంటి/వంట పనులు చేయుటకు స్త్రీ/పు కావలెను. భోజనం+ వసతి ఫ్రీ. ✆ 9032356177, 9492623246.

రక్ష ఓల్డేజ్‌హోం: హైదరాబాద్‌లో వృద్ధులను చూసుకొనుటకు, భార్యభర్తలు మరియు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 17-20 వేలు+ భోజనం+ వసతి ఫ్రీ. ✆ 9618471222, 9618431222.

Veedol **ఇంజిన్** ఆయిల్స్ మార్కెట్ చేయుటకు ఏలూరు పరిసర ప్రాంతాలలో పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 25-40 సంవత్సరంలోపు వయసు ఉండి ఇంటర్ ఆపైన చదివి ఫీల్డ్ సేల్స్‌లో కనీస అనుభవం కలిగిన వారు కావలెను. ఆకర్షణీయమైన జీతం, PF & ESI, TA, DA & ఇన్సెంటివ్స్. శ్రీ గోపాల్ ఆటోమోటివ్ లిమిటెడ్, తాడేపల్లిగూడెం, Cell: 80085 77055, 94401 56633.

WANTED
Experienced App download and field Sales Executives to Promote our OTT app in & around West Godavari & East Godavari Districts.
We welcome interested DISTRIBUTORS.
Mail your resume with your photo to
sridhar@bcndigitaltv.com
The Bhimavaram Community Network, Madhapur , Hyd

BATACH WELFARE FOUNDATION
నందు మండల కో ఆర్డినేటర్‌గా పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా పనిచేయడానికి క్రమశిక్షణ కలిగిన అభ్యర్థులు కావలెను.
అర్హత : ఏదైనా డిగ్రీ లేదా (10+2) Pass
వయస్సు : 21 సం॥ నుండి 45 సం॥ వయస్సు లోపు
జీతం : 12 వేలు నుండి 18 వేలు
PF, ECI, Insurance Facility
ఇంటర్వ్యూ తేది: 29-09-24 (ఆదివారం) 30-09-24 (సోమవారం)
సమయం : ఉ॥ 9.30 గం॥ నుండి సా॥-5 గం॥ వరకు
స్థలము: Up Stairs Indian Bank Surya Teja Nagar Road Beside ASNM Jr College, Palakollu -534260
Phone: 63042 29175

MARKETING/ SALES

ప్రముఖ కంపెనీలో: మార్కెటింగ్ చేయుటకు ఏజెంట్స్ కావలెను. ✆ 83282 77447, 79890 59301, 80747 59794.

ఆసియాలోనే అతిపెద్ద విద్యాసంస్థలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ కావలెను. జీతం. Up to 25,000/- Contact: 95330 47899.

CATERING

రాయపూర్ (ఛత్తీస్‌ఘడ్) ఊరులో క్లౌడ్ కిచెన్‌లో తెలుగు వెజ్ వంటలు చేయడానికి ఒక అనుభవశాలియైన కుక్ కావాలి. జీతము వంట నైపుణ్యాన్ని బట్టి. సంప్రదించండి - 9425203443

SECURITY GUARDS

తాడేపల్లిగూడెం, రావులపాలెం జంగారెడ్డిగూడెం, తణుకు, ఏలూరు, భీమవరం & తూర్పు / పశ్చిమ గోదావరిలో సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. 12 గం॥ డ్యూటీ, 50 సం॥లోపు. జీతం: 13,000 + PF+ESI. Ph: 72880 04466

TOURS AND TRAVELS

చలసాని ట్రావెల్స్ (కాళేశ్వరి) ఏలూరు నుండి బెంగుళూరు, బెంగుళూరు నుండి ఏలూరు ప్రతి రోజు Ac స్లీపర్ బస్సులు మరియు పార్శిల్ సౌకర్యం కలదు. మినీ బైపాస్, ఏలూరు. ✆ 93946 76769.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న, లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల్లో ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.35 పైII
తణుకు ఆఫీసు: 08819-224254

ఆకాశమే హద్దుగా పర్యాటకుల కోలాహలం

రామోజీ ఫిల్మ్‌సిటీ, న్యూస్‌టుడే: పండగల వేళ పర్యాటకుల రాకతో రామోజీ ఫిల్మ్‌సిటీ సందడిగా మారింది. దసరా, దీపావళి పండగలను పురస్కరించుకుని ఈ నెల 26న ప్రారంభమైన వేడుకల్లో నిత్యం ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఫిల్మ్‌సిటీ సందర్శనకు వచ్చి మ్యాజికల్ గార్డెన్ అందాలను వీక్షిస్తూ మురిసిపోతున్నారు. ఫిల్మీ స్ట్రీట్ విశేషాలు ఆకాశంలో పొలోమని ఆకట్టుకుంటున్నాయి. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వేడుకల్లో పాలుపంచుకుంటూ చిన్నా, పెద్ద ఉల్లాసంగా గడుపుతున్నారు.

రామోజీ ఫిల్మ్‌సిటీలో సందడే సందడి





RAMOJI FILM CITY

సందర్శకుల కార్యక్రమాలు, వినోదం పంచే ఏర్పాట్లు ప్రతి ఒక్కరినీ ఆనందతీరాలకు చేరుస్తున్నాయి. లైవ్ షోలు మధురానుభూతిని పంచుతున్నాయి. సాయంత్రం వేళల్లో సంతోషాలను ఆస్వాదించాలనుకునే పర్యాటకులు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి వచ్చి ఆనందిస్తున్నారు. రామోజీ ఫిల్మ్‌సిటీని సరికొత్త విద్యుద్దీప కాంతుల్లో కళ్లారా వీక్షించి మధుర జ్ఞాపకాలను పదిలం చేసుకుంటున్నారు. స్టూడియో టూర్‌తో ఫిల్మ్‌సిటీని చుట్టేస్తూ సినీజగత్తులో విహారాన్ని ఆస్వాదిస్తున్నారు. రాజసం ఉట్టిపడేలా సాగే కార్నివాల్ పరేడ్, సంభ్రమాశ్చర్యాలను కళ్లముందుకు తెచ్చే మోషన్ క్యాప్చర్, వర్చువల్ షూట్ ఇలా.. అనుక్షణం ఆనంద వీక్షణాలతో పండగల వేళ చిన్నాపెద్దా ఆనందిస్తున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. మీరూ రామోజీ ఫిల్మ్‌సిటీ సంబరాల్లో పాలుపంచుకోవచ్చు పదండి.



రవాణా సౌకర్యం.. రామోజీ ఫిల్మ్‌సిటీలో పండగ సంబరాలకు విచ్చేసే పర్యాటకులకు హైదరాబాద్ నగరంలోని వివిధ ఎంపిక చేసిన ప్రాంతాల నుంచి పికప్, డ్రాపింగ్ సౌకర్యం కల్పిస్తున్నారు. ఎలాంటి ఇబ్బంది లేకుండా వేడుకలను ఆస్వాదించేందుకు వచ్చే వారికి ఇది ఎంతగానో దోహదపడుతుంది.

మరిన్ని వివరాలకు..
www.ramojifilmcity.com ఫోన్ నంబర్ 76598 76598ను సంప్రదించవచ్చు.

లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని శిక్షించాలని ప్రదర్శన

గణపవరం, న్యూస్‌టుడే: తిరుమల లడ్డు ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వారిని కఠినంగా శిక్షించాలంటూ కూటమి నాయకులు శనివారం గణపవరంలో ప్రదర్శన నిర్వహించారు. గణపవరం తహసీల్దారు కార్యాలయం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ప్రదర్శన సాగింది. శ్రీ వేంకటేశ్వరస్వామి నామస్మరణ, కోలాట నృత్యంతో ప్రదర్శన సాగింది. అనంతరం లడ్డు ప్రసాదం కల్తీ చేసిన వారిపై కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. కూటమి నాయకులు ముత్యాల వాసు, కుసుంపూడి సురేంద్రరాజు, గంటా అన్నవరం, కొయ్యల వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



గణపవరం: ప్రదర్శన నిర్వహిస్తున్న కూటమి నాయకులు

పవన్ దీక్షకు మద్దతుగా నేడు భాజపా ధర్నా

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదం కల్తీ విషయమై జనసేన అధినేత పవన్ కల్యాణ్ చేపట్టిన దీక్షకు మద్దతుగా ఆదివారం మధ్యాహ్నం 2 గంటలకు ఏలూరు అగ్నిమాపక కూడలి కేంద్రంలో ధర్నా చేయాలని భాజపా నిర్ణయించింది. రాజకీయాలకతీతంగా అన్ని హిందూ సంఘాల ప్రతినిధులు, భాజపా నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -121 రిటైల్ ధర 143 చికెన్ విత్ స్కిన్ - 207, చికెన్ స్కిన్‌లెస్ - 236.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 128, 137, 148 చికెన్ విత్ స్కిన్ - 250 చికెన్ స్కిన్‌లెస్ - 260.

సమస్యలుంటే నా దృష్టికి తీసుకురండి: కలెక్టర్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: వసతి గృహాల్లో సమస్యలున్నా, సౌకర్యాలు లేకపోయినా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరిస్తానని కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ బాలికల వసతిగృహాలను శనివారం రాత్రి ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి విద్యార్థినులతో మాట్లాడారు. భోజనం నాణ్యతను, ఇతర సదుపాయాలను పరిశీలించారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. రోడ్లు సరిగా లేవని, వర్షపునీరు శ్లాబు నుంచి కారుతుందని బీసీ వసతి గృహ విద్యార్థినులు వివరించారు. వెంటనే మరమ్మతులు చేయిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.



విద్యార్థినులతో మాట్లాడుతున్న వెట్రిసెల్వి

కోర్టు కేసుల పరిష్కారానికి చర్యలు చేపట్టాలి.. ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రెవెన్యూపరంగా కోర్టు కేసుల పరిష్కారానికి తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. రెవెన్యూ డివిజనల్ అధికారులు, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లతో శనివారం కలెక్టరేట్ నుంచి వర్చువల్ విధానంలో ఆమె సమీక్షించారు.

ఉద్యమాలతోనే రైతు సమస్యలకు పరిష్కారం

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రైతుల సమస్యల పరిష్కారానికి ఉద్యమాలే మార్గమని అఖిల భారత కిసాన్ సభ(ఏఐకేఎస్) జాతీయ సహాయ కార్యదర్శి టి.సాగర్ అన్నారు. ద్వారకాతిరుమల శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర స్థాయి శిక్షణ తరగతులు రెండో రోజు శనివారం నిర్వహించారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ దేశంలో జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటాల ద్వారా రైతుల చేతికి భూమి దక్కిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నాలుగు వేల మంది అమరులయ్యారని, వేల మంది జైలుపాలయ్యారని వివరించారు. ఉద్యమాల ద్వారా సాధించుకున్న హక్కులను ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని దుయ్యబట్టారు. కేంద్ర ప్రభుత్వ విధానాలు రైతులకు ఉరితాడులా మారాయని ఆరోపించారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం భూములు కోల్పోయిన వారికి న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మల్లాప్రగడ సూర్యనారాయణ, కె.మోహనరావు, కట్టా భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.



సాయి నాగవెంకట్



హేమలత



ఆస్మీ



కోటేశ్వరి

ఏలూరు వైద్య కళాశాలకు ర్యాంకుల పంట

అనాటమీ విభాగంలో మొదటి 10 ర్యాంకుల్లో 4 కైవసం

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థులు ప్రతిభ సాధించారు. కళాశాల ఏర్పాటుచేశాక మొదటి బ్యాచ్ విద్యార్థులు ఇంతటి విజయాన్ని నమోదు చేయడంతో ఆచార్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అనాటమీ విభాగంలో మొదటి 10 ర్యాంకుల్లో 1, 3, 6, 9 ర్యాంకులు సాధించారు. మద్దుల సాయినాగవెంకట్ 1, బడిస కోటేశ్వరి 3, ఆస్మీ 6, పైడి హేమలత 9వ ర్యాంకు సాధించారు. వర్సిటీ టాపర్స్‌గా నిలిచిన వీరిని ప్రిన్సిపల్ శశిధర్, అనాటమీ విభాగం హెచ్‌వోడీ శ్యామల అభినందించారు. ఏలూరు ప్రభుత్వ వైద్య కళాశాలకు 150 సీట్లు కేటాయించగా మొదటి సంవత్సరం విద్యార్థులు పరీక్షలు రాశారు.

ఆర్జీయూకేటీ నియామకాల డీన్‌గా శ్యామ్

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో ఈసీఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శ్యామ్ కళాశాల ట్రైనింగ్, ప్లేస్మెంట్స్, ఇంటర్న్‌షిప్, ఇంకుబేషన్ డీన్‌గా నియమితులయ్యారు. శ్యామ్ గతంలో కళాశాల పరిపాలన అధికారిగా విధులు నిర్వహించారు. ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్, పరిపాలనాధికారి లక్ష్మణరావు, అధ్యాపకులు ఆయనను అభినందించారు.



సత్రంపాడులో భారీ చోరీ

15 కాసుల బంగారం, నగదు అపహరణ

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: ఇంటి యజమానులు లేని సమయంలో దొంగలు ఇంట్లోకి చొరబడి బంగారు ఆభరణాలు, నగదు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏలూరు శాంతినగర్ 12వ రోడ్డులో నివాసముంటున్న విశ్రాంత బ్యాంకు ఉద్యోగి రావూరి జ్ఞానానంద రావు వైద్యం నిమిత్తం 15 రోజుల కిందట ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి హైదరాబాద్ వెళ్లారు. ఈ నెల 27న రాత్రి దొంగలు ఇంటి తలుపు తాళాలు పగులకొట్టి లోనికి చొరబడ్డారు. బీరువాలోని 15 కాసుల బంగారు నగలు, 10 కేజీల వెండి, కొంత నగదు అపహరించుకు పోయారు. శనివారం తలుపు తీసి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఇంటి యజమానులకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. డీఎస్పీ శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు సిబ్బందితో ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. మరో వైపు క్లూస్ టీం, సీసీఎస్ పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఈనాడు ప్రతిభ
pratibha.eenadu.net/eenadupratibha.net
ప్రభుత్వ ఉద్యోగ పరీక్షల ప్రత్యేకం!

కరెంట్ అఫైర్స్

✦ గోవాలో ఏటా నిర్వహించే ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆఫ్ ఇండియా (ఐఎఫ్ఎఫ్ఐ) 55, 56వ ఎడిషన్లకు డైరెక్టర్‌గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?



జ: ప్రముఖ భారత దర్శకుడు శేఖర్ కపూర్

✦ 2024–2025 సంవత్సరానికి 'ఆసియా డిజాస్టర్ ప్రిపేర్డ్‌నెస్ సెంటర్ (ఏడీపీసీ) అధ్యక్ష బాధ్యతలను ఇటీవల ఏ దేశం చేపట్టింది? జ: భారత్

మాదిరి ప్రశ్నలు

(ఎన్‌డీఎంఏ సభ్యుడు, విభాగాధిపతి రాజేంద్రసింగ్ 2024, జులై 25న ఏడీపీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టారు)

✦ దేశంలోనే తొలిసారిగా ఏ ఓడరేవులో సమగ్ర వ్యవసాయ ఎగుమతి సౌకర్యాన్ని (ఇంటిగ్రేటెడ్ అగ్రి ఎక్స్‌పోర్ట్ ఫెసిలిటీ) అభివృద్ధి చేస్తున్నారు? (ఈ ప్రాజెక్టు విలువ రూ.284.19 కోట్లు. విస్తీర్ణం 67,422 చదరపు మీటర్లు. ఈ ఓడరేవు ఇప్పటికే దేశంలో మొదటి 100 శాతం ల్యాండ్ లార్డ్ పోర్టుగా గుర్తింపు పొందింది.)

జ: జవహర్‌లాల్ నెహ్రూ పోర్ట్, ముంబయి

✦ 'వరల్డ్ హెపటైటిస్ డే'ను ఏటా ఏ రోజు నిర్వహిస్తారు? ('ఇట్స్ టైం ఫర్ యాక్షన్' అనేది ఈ ఏడాది థీమ్.) జ: జులై 28

✦ దేశంలో 500వ కమ్యూనిటీ రేడియో స్టేషన్ 'అప్నా రేడియో 90.0 FM ను ఇటీవల ఎక్కడ ప్రారంభించారు?

జ: ఐజ్వాల్

మరింత సమాచారం

ప్రిపరేషన్ టెక్నిక్

అన్ని సబ్జెక్టులను చదవడానికి, రివిజన్‌కు వీలు కల్పించే విధంగా స్టడీప్లాన్ సిద్ధం చేసుకోవాలి. సబ్జెక్టుల వారీగా అభ్యర్థుల బలాలు, బలహీనతల ఆధారంగా ఆ ప్రణాళిక ఉండేలా చూసుకోవాలి.


డీఎస్సీ/టెట్ - 2024

తెలుగు కంటెంట్

నవోతరగతి

తెలుగు

ప్రత్యక్ష దైవాలు



తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు!

ప్రశ్నలు జవాబులు

1) 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి గురించి రాయండి. (4 మా.)

జ: 'ప్రత్యక్ష దైవాలు' పాఠం రచించిన కవి ఎఱ్ఱన.

కాలం: క్రీ.శ.14వ శతాబ్దం. తల్లిదండ్రులు: పోతమ్మ, సూరనలు. జననం: పాకనాడు సీమ (నెల్లూరు జిల్లా కందుకూరు సమీపంలోని గుడ్లూరు గ్రామం). ఉద్యోగం: అద్దంకిని రాజధానిగా చేసుకుని పరిపాలించిన ప్రోలయ వేమారెడ్డి ఆస్థాన కవి. రచనలు: రామాయణం, హరివంశం, అరణ్యపర్వశేషం, నృసింహపురాణం బిరుదులు: శంభుదాసుడు, ప్రబంధ పరమేశ్వరుడు. రచనా శైలి: సూక్తి వైచిత్రితో పేరెన్నిక గన్నది. ✦ ప్రస్తుత పాఠ్యాంశాన్ని మహాభారతంలోని అరణ్యపర్వంలోని 5వ ఆశ్వాసం నుంచి గ్రహించారు.

2) వృద్ధాశ్రమాలు పెరిగిపోతున్న నేటి రోజుల్లో 'తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదు' అనే ధర్మవ్యాధుడి అభిప్రాయ ప్రాధాన్యతను పాఠం ఆధారంగా వివరించండి. (8 మా.)

జ: తల్లిదండ్రుల సేవను మించిన ధర్మం లేదని మన పురాణాలు, ఇతిహాసాలు, శాస్త్రాలు ఘోషిస్తున్నాయి. ✦ తల్లిదండ్రులే పిల్లలకు ప్రత్యక్ష దైవాలు. ✦ వారిని కష్టపెట్టకూడదు. ✦ కేవలం అమ్మానాన్నలను పూజించడం తప్ప వేరే దైవాన్ని కూడా పూజించని ధర్మవ్యాధుడు ధర్మాత్ముడు అయ్యాడు. ✦ వేదాలు, శాస్త్రాలు చదివిన కౌశికుడి లాంటి వ్యక్తికి కూడా ధర్మసూక్ష్మాలు తెలిపాడు. ✦ మనకు శరీరాన్నిచ్చి, పెంచి, పోషించి ఒకస్థాయికి తీసుకుని వచ్చిన తల్లిదండ్రులను మించిన దైవం లేదని ధర్మవ్యాధుడు తన మాటలు, ఆచరణ ద్వారా నిరూపించాడు. ✦ తల్లిదండ్రులను పట్టించుకోకుండా ఎంత జ్ఞానం సంపాదించినా, పుణ్య కార్యాలు చేసినా ప్రయోజనం లేదు. ✦ యజ్ఞాలు, వ్రతాలు, పూజలు అన్నీ చేసిన ఫలితం తల్లిదండ్రుల సేవ వల్ల లభిస్తుంది. ✦ ఇంట్లో కన్నవారి రూపంలో ఉన్న ప్రత్యక్ష దైవాలను వదిలి జ్ఞానం, పుణ్యం కోసం ఎక్కడెక్కడికో వెళ్లడం వెర్రితనం.

ముఖ్యమైనవి మరికొన్ని..

8 మార్కుల ప్రశ్నలు

1) ప్రత్యక్ష దైవాలు పాఠం సారాంశాన్ని మీ సొంత మాటల్లో రాయండి.

2) ఈ పాఠం ఆధారంగా ధర్మవ్యాధుడి వ్యక్తిత్వాన్ని విశ్లేషించండి.

జవాబుల కోసం

– చెరుకూరి వేంకట సూర్యనారాయణ శర్మ

మనుగడకు మూలాలు.. ప్రగతి సాధనాలు!

ఇండియన్ జాగ్రఫీ

ఆధునిక ప్రపంచం మనుగడ అంతా శక్తివనరులపైనే ఆధారపడి నడుస్తోంది. విద్యుత్తు తయారీకి, వాహనాలు నడిచేందుకు, వివిధ ఉత్పత్తులకు శిలాజ ఇంధనాలే ప్రధాన ఆధారాలు. ఆర్థిక, అభివృద్ధి కార్యకలాపాల్లో వాటిని విస్తృతంగా వినియోగిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంప్రదాయ ఇంధన వనరులైన బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, అణుశక్తికి సంబంధించిన ప్రాథమికాంశాలను పరీక్షార్థులు తెలుసుకోవాలి. దేశంలో వాటి లభ్యత, విస్తరణ, ఉత్పత్తి తీరుతెన్నులు, ఆ కార్యకలాపాల్లో నిమగ్నమైన భారత ప్రభుత్వ సంస్థల గురించి అవగాహన కలిగి ఉండాలి.

శక్తివనరులు

ఆధునిక యుగంలో దేశ ఆర్థిక వ్యవస్థను నిర్దేశించే ప్రధాన కారకం శక్తివనరు. ఏదైనా ఒక దేశం వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి ఇది చాలా అవసరం. ఒక ప్రదేశ ఆర్థిక అభివృద్ధి, అక్కడి శక్తిసంపద, దాన్ని వినియోగిస్తున్న విధానంపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం శక్తివనరులను ప్రాథమిక స్థాయి నుంచి అంటే ఆహార పదార్థాలను వండుకోవడం నుంచి ఆధునిక స్థాయి అంటే పరిశ్రమలు, వ్యాపారం, రవాణా, సమాచార అభివృద్ధి వరకు బహుళ ప్రయోజనాల కోసం వినియోగిస్తున్నారు. మూలాధారం, వినియోగం ఆధారంగా శక్తివనరులను రెండు రకాలుగా పేర్కొనవచ్చు. అవి 1) వాణిజ్యేతర శక్తి 2) వాణిజ్య శక్తి. అటవీ ఉత్పత్తులు, కర్రబొగ్గు, ఆవు పేడ, వ్యవసాయ వ్యర్థాలు, పశువుల శక్తి మొదలైనవి వాణిజ్యేతర శక్తి వనరులు. నేలబొగ్గు, సహజవాయువు, జలవిద్యుత్తు, చమురు (క్రూడ్ ఆయిల్), పవనశక్తి, సౌరశక్తి, అణుశక్తి మొదలైనవి వాణిజ్య శక్తికి ఉదాహరణలు. మరోవిధంగా శక్తివనరులు రెండు రకాలు అవి-

> దేశంలో బొగ్గు ఉత్పత్తిలో ముందంజలో ఉన్న రాష్ట్రాలు ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్. ప్రస్తుతం 90% బొగ్గు ఉత్పత్తి ఉపరితల గనుల ద్వారా జరుగుతోంది. భారత్ బొగ్గును నేపాల్, బంగ్లాదేశ్, భూటాన్‌కు ఎగుమతి చేస్తూ; ఇండోనేసియా, దక్షిణాఫ్రికాల నుంచి దిగుమతి చేసుకుంటోంది.

1) **తరిగిపోయేవి:** వాడిన కొద్దీ నిల్వలు తగ్గిపోతూ ఉంటాయి. పునరుత్పత్తి చేయడం కుదరదు. వీటినే సంప్రదాయ ఇంధన వనరులు అంటారు. అవి- బొగ్గు, చమురు, సహజవాయువు, అణుశక్తి, యురేనియం, థోరియం.

2) **తరగనివి:** ఎంత వాడినా, ఎన్నిసార్లు వాడినా తరిగిపోవు. మళ్లీ మళ్లీ ఉపయోగించవచ్చు. వీటినే సంప్రదాయేతర ఇంధన వనరులు అంటారు. అవి నీరు, గాలి, సూర్యరశ్మి మొదలైనవి.

దేశంలో వాణిజ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని బొగ్గు, ముడిచమురు, అణుశక్తి, సహజవాయువు, జలవిద్యుత్తును వినియోగిస్తున్నారు. నేడు సౌరశక్తి, పవనశక్తి, సముద్ర తరంగాల శక్తి, జీవశక్తి (బయోఎనర్జీ) ఉత్పత్తి, వాడకమూ పెరిగింది.



రావత్‌భటాలోని రాజస్థాన్ అటామిక్ పవర్ ప్రాజెక్ట్ (ఆర్ఏపీపీ)

సంప్రదాయ ఇంధన వనరులు

బొగ్గు: ఇంధన వనరుల్లో ప్రధానమైంది. దేశంలో జరిగే విద్యుత్తు ఉత్పత్తిలో 50% పైగా బొగ్గు ద్వారానే జరుగుతోంది. ప్రపంచంలో అధిక బొగ్గు నిల్వలున్న దేశాల్లో భారత్ 5వ స్థానంలో (2023-24 - 378.21 బి.టన్నులు) ఉంది. (మొదటి నాలుగు స్థానాల్లో అమెరికా, రష్యా, ఆస్ట్రేలియా, చైనా ఉన్నాయి.) ప్రపంచంలో బొగ్గు ఉత్పత్తి దేశాల్లో భారత్‌ది రెండో స్థానం (2023-24- 997.25 మిలియన్ టన్నులు). (మొదటి స్థానంలో చైనా, మూడో స్థానంలో ఇండొనేసియా ఉన్నాయి.) బొగ్గును 'నల్లబంగారం' అంటారు. దేశంలో బొగ్గు నిక్షేపాలు రెండు రకాలు.

గోండ్వానా రకం నిక్షేపాలు: ఇవి కార్బోనిఫెరస్ యుగంలో ఏర్పడ్డాయి. మహానది, సోన్, నర్మద, దామోదర్ నదీ లోయ ప్రాంతాల్లో; తెలంగాణ, ఏపీలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉన్నాయి. దేశంలోని మొత్తం బొగ్గులో 98%ఈ రకమే. నాణ్యమైన ఆంథ్రసైట్, బిట్యుమినస్ రకానికి చెందింది.

టెర్షియరీ రకం: ఇది లిగ్నైట్ రకానికి చెందింది. అస్సాం, శివాలిక్ కొండల వద్ద రాజస్థాన్, కశ్మీర్‌లో; తమిళనాడులోని కడలూర్ జిల్లా నైవేలి, గుజరాత్‌లోని కచ్ ప్రాంతాల్లో లభిస్తుంది. దేశం బొగ్గు నిల్వల్లో ఈ రకం 2% మాత్రమే.

బొగ్గు రకాలు: బొగ్గు ఏర్పడే క్రమంలో ఒత్తిడి, ఉష్ణోగ్రత, కాలం ఆధారంగా పలు రకాలుగా ఏర్పడతాయి. బొగ్గులో మందం, గట్టిదనం, తేమశాతం, బూడిద రకం వేరుగా ఉంటాయి.

ఆంథ్రసైట్: ఇది నాణ్యమైంది, దృఢమైంది. నలుపు రంగులో ఉంటుంది. ఇందులో 80% పైగా కార్బన్ ఉంటుంది. జమ్ము-కశ్మీర్‌లో లభిస్తుంది. మండేటప్పుడు నీలి రంగులో ఉంటుంది.

బిట్యుమినస్ రకం: మెత్తగా ఉంటుంది. దేశంలో అత్యధికంగా ఉన్నది ఇదే. దీనిలో కర్బనం 40-80%, తేమ 15-40% ఉంటుంది. ఝార్ఖండ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్‌ల్లో లభిస్తుంది.

లిగ్నైట్: దీన్ని గోధుమ రంగు బొగ్గు అంటారు. 40%-50% కర్బనం, 35% తేమ ఉంటుంది. నైవేలి (తమిళనాడు), పల్నా (రాజస్థాన్), లక్ష్మీపుర్ (అస్సాం), కారేవా (జమ్ము-కశ్మీర్)ల్లో లభిస్తుంది. తమిళనాడులో లిగ్నైట్ నిక్షేపాలు అధికం.

> దేశంలో 1774లో అప్పటి బ్రిటిష్ గవర్నర్ జనరల్ వారెన్ హేస్టింగ్స్ అనుమతితో మొదటిసారిగా పశ్చిమ బెంగాల్‌లోని 'రాణిగంజ్' వద్ద బొగ్గు గనుల తవ్వకం ప్రారంభమైంది.
>
> ప్రపంచ థర్మల్ విద్యుత్తు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి రెండు స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి.

పిట్: దీనిలో 40-50% కర్బనం ఉంటుంది. బొగ్గు తయారయ్యే క్రమంలో ఏర్పడుతుంది. దీన్ని కాల్చినప్పుడు పొగ, బూడిద ఎక్కువగా వస్తాయి.

ముడిచమురు: పెట్రోలియం అంటే శిలాజ ఇంధనం. దీని నుంచే పెట్రోలు, డీజిల్, కిరోసిన్ లభిస్తాయి. దేశంలో మొదట అస్సాంలోని మాకూమ్ (1867)లో ముడిచమురు గుర్తించగా, అస్సాంలోని డిగ్బాయ్ (1889)లో తొలుత చమురు వెలికితీశారు. సహర్ కటియ, కాంభట్ సింధుశాఖ, బాంబే హై వద్ద పెట్రోలియం నిల్వలను గుర్తించారు. 1956లో భారత్‌లో ఓఎన్‌జీసీ (ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్) ఏర్పడింది. నాటి నుంచి దీని పర్యవేక్షణలో చమురు నిల్వల అన్వేషణ, వెలికితీత జరుగుతోంది. 2024, సెప్టెంబరు 19 నాటికి భారత్‌లో గుర్తించిన చమురు నిల్వల అంచనా 410.5 మిలియన్ మెట్రిక్ టన్నులు. 2023-24 నాటికి వెలికితీసిన ముడిచమురు 29.4 మిలియన్ మెట్రిక్ టన్నులు.

> ఒక బారెల్ ముడిచమురు నుంచి 42% పెట్రోలు, 22% డీజిల్, 9% జెట్ ఇంధనం, 5% కిరోసిన్, 4% ఎల్‌పీజీ, 18% ఇతర పదార్థాలు వస్తాయి.
>
> ప్రపంచ పెట్రోలు వినియోగంలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా, రెండో స్థానంలో చైనా ఉన్నాయి.


సహజ వాయువు: భారత్‌లో సహజవాయువు పరిశ్రమ 1960ల్లో అస్సాంలోని డిగ్బాయ్, మహారాష్ట్రలోని ముంబయి హై ఫీల్డ్‌లో ప్రారంభమైంది. 2020-21 లెక్కల ప్రకారం దేశంలో మొత్తం సహజవాయువు నిల్వలు 1,372.62 బి.క్యూబిక్ మీటర్లు. మొత్తం నిక్షేపాల్లో సముద్ర తీరప్రాంతాల్లో ఎక్కువగా ఉండగా, పశ్చిమ తీరంలో 23.7%, తూర్పు తీరప్రాంతాల్లో 41%గా ఉంది. దేశంలో ఉత్పత్తి అయ్యేమొత్తం సహజవాయువులో 75% ఓఎన్‌జీసీ ఉత్పత్తి చేస్తుంది.

అణుశక్తి: అణుశక్తికి కావాల్సినవి యురేనియం, థోరియం నిల్వలు. దేశంలో కేరళ, తమిళనాడు రాష్ట్రాల తీరప్రాంతంలో ఇల్మినైట్, మోనోజైట్ ఖనిజాలు లభిస్తాయి. ఇల్మినైట్ నుంచి టిటానియం, మోనోజైట్ నుంచి థోరియం వస్తాయి. యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియాను 1967లో ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దేశంలో 6,780 మెగావాట్ల సామర్థ్యంతో 7 వేర్వేరు కేంద్రాల్లో మొత్తం 24 అణువిద్యుత్తు రియాక్టర్లు పనిచేస్తున్నాయి. 1972లో రాజస్థాన్‌లోని కోటా సమీపంలో రెండో అణువిద్యుత్తు కేంద్రాన్ని రావత్‌భటాలో స్థాపించారు.



రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

పొంచి ఉన్న ప్రమాదం!



మరమ్మతులు చేపట్టాల్సిన వంతెన




గున్నంపల్లి, కప్పలకుంట మధ్యలోని పోలవరం కాలువకు ఇరువైపులా జాతీయ రహదారి విభాగిని దాటి ప్రమాదకరంగా వెళ్తున్న వాహన చోదకులు

ద్వారకాతిరుమల మండలం గున్నంపల్లి, కప్పలకుంట మధ్యలోని జాతీయ రహదారిపైనున్న వంతెన బలహీనంగా ఉంది. తాత్కాలికంగా వంతెనకు మరమ్మతులు చేపట్టేందుకు వాహనాలను దారి మళ్లించాల్సి ఉంది. దీంతో పది రోజుల క్రితం వంతెనకు ఇరువైపులా ఉన్న జాతీయ రహదారి విభాగినులను కొంతమేర తొలగించారు. పనులింకా మొదలుకాకపోవడంతో తాత్కాలికంగా వాహనదారులు ఇటువైపు రాకుండా ఉండేందుకు బారికేడ్లను ఉంచారు. అయినాసరే కొంతమంది వాహనదారులు ప్రమాదకరంగా జాతీయ రహదారిని దాటుతున్నారు. ఇరువైపులా అత్యంత వేగంతో వస్తున్న వాహనాలు ఏమరుపాటు వహిస్తే ప్రమాదం పొంచి ఉన్నట్టే. మరమ్మతులు పూర్తయ్యేవరకూ బారికేడ్లను పటిష్ఠంగా ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు. - **ఈనాడు, ద్వారకాతిరుమల**

చిట్టడవి కాదిది.. మార్కెట్ యార్డే!





ఆవరణలోని పాలశీతలీకరణ కేంద్రం చెంత ఇలా..

చెట్ల చెంత పుట్టలు

అత్తిలిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో తుప్పలు ఏపుగా పెరగడంతో చిట్టడవిని తలపిస్తోంది. చెట్లను ఆనుకొని పుట్టలున్నాయి. విషసర్పాలు సంచరిస్తుండటంతో స్థానికులు భయపడుతున్నారు. ఆవరణంతా నాచు పట్టింది. ఐదు గోదాముల్లో ఒకటే వినియోగంలో ఉంది. అందులో పేదల ఇళ్లకు సంబంధించిన సిమెంటు, ఇనుము ఉన్నాయి. మిగిలినవన్నీ నిరుపయోగంగా ఉన్నాయి. దీనిపై కార్యదర్శి ఎస్కే గౌస్‌బాషా మాట్లాడుతూ జంగిల్ క్లియరెన్స్ నిమిత్తం ఏటా టెండర్లు పిలుస్తామని, ఈ ఏడాది ఎవరూ ముందుకు రాలేదని తెలిపారు. - **ఈనాడు, అత్తిలి**



గోదాముల చెంత ఏపుగా పెరిగిన తుప్పలు

ఆన్‌లైన్‌లో కేసులు దాఖలు చేయొచ్చు



మాట్లాడుతున్న న్యాయమూర్తి మంగా కుమారి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఆన్‌లైన్‌లో కేసులు దాఖలు చేసుకోవచ్చని, ఈ విషయమై అవగాహన కల్పిస్తున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ఇన్‌ఛార్జి జడ్జి మంగా కుమారి అన్నారు. ఏలూరు కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ భవన్లో శనివారం న్యాయవాద గుమస్తాలు, న్యాయవాదులకు ఆన్‌లైన్‌లో కేసుల దాఖలు ప్రక్రియపై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంగా కుమారి మాట్లాడుతూ కక్షిదారులకు మరింత వేగంగా న్యాయ సేవలు అందించేందుకు ఆన్‌లైన్ విధానం దోహదపడుతుందన్నారు. 8వ అదనపు జిల్లా జడ్జి సునీల్‌కుమార్, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసమూర్తి, అదనపు సీనియర్ సివిల్ జడ్జి బుల్లి కృష్ణ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కోనే సీతారాం తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి ఆళ్ల నానిపై ఛీటింగ్ కేసు

ఏలూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: మాజీ డిప్యూటీ సీఎం, ఏలూరు మాజీ ఎమ్మెల్యే ఆళ్ల నాని, మరికొందరిపై త్రీటౌన్ పోలీసు స్టేషన్‌లో ఛీటింగ్ కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇటీవల సార్వత్రిక ఎన్నికల సమయంలో శాంతినగర్ లక్ష్మీకృష్ణ రెసిడెన్సీ అపార్టుమెంట్లో వైకాపా నాయకుడు దిరిశాల వరప్రసాద్ తదితరులతో కలిసి శాంతినగర్‌కు చెందిన అవుటుపల్లి నాగమణి ప్రచారంలో పాల్గొన్నారు. 4వ అంతస్తులో ప్రచారం ముగించుకొని కిందకు దిగేందుకు అందరూ లిఫ్ట్ ఎక్కారు. అది ఫెయిలై కిందకు పడిపోవడంతో అందరూ ఒకరిపై ఒకరు పడిపోయారు. ఈ క్రమంలో నాగమణికి గాయాలు కావడంతో ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. సచివాలయ వాలంటీర్లు కూడా ఉన్నందున ఎన్నికల సంఘంతో ఇబ్బందులు వస్తాయని విషయాన్ని బయటకు పొక్కనీయలేదు. బాధితురాలు నాగమణికి వైద్య ఖర్చులు పెట్టుకుంటామని, ప్రమాద బీమా వచ్చేలా చేస్తామని, ఆర్థికంగా కుటుంబాన్ని ఆదుకుంటామని అప్పట్లో ఆళ్ల నాని హామీ ఇచ్చారు. తరువాత పట్టించుకోలేదు. నష్టపరిహారం కూడా రాలేదు. బాధితురాలు గట్టిగా అడగగా నాయకులు బెదిరించారు. తరువాత నష్టపరిహారం ఇవ్వకపోగా.. పట్టించుకోక పోవడంతో బాధితురాలు కోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు త్రీటౌన్ పోలీసులు శనివారం రాత్రి ఆళ్ల నాని, దిరిశాల వరప్రసాద్, సుధీర్‌బాబు, జీలూఖాన్, కురెళ్ల రాం ప్రసాద్, ప్రైవేటు వైద్యులు సునీల్ సందీప్, లక్ష్మీకృష్ణ రెసిడెన్సీ ప్రెసిడెంట్, సెక్రటరీలపై కేసు నమోదు చేశారు.

1న హ్యాండ్ రోల్‌బాల్ జట్ల ఎంపిక

వీరవాసరం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ 14, 17 విభాగాల్లో బాలబాలిక హ్యాండ్ రోల్‌బాల్ ఉమ్మడి జిల్లా జట్ల ఎంపిక పోటీలను అక్టోబరు 1న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ జిల్లా కార్యదర్శి పీఎస్ఎన్ మల్లేశ్వరరావు తెలిపారు. తణుకు పురపాలక ఉద్యానవనంలో పోటీలు జరుగుతాయన్నారు. వివరాలకు 80741 53923 నంబరులో సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

సొమ్ము మున్సిపాలిటీది.. పని కారుమూరి ఇంట్లో..

అయిదేళ్లలో భ్రష్టు పట్టిన పురపాలన: ఆరిమిల్లి



మాట్లాడుతున్న రాధాకృష్ణ

తణుకు గ్రామీణం, న్యూస్‌టుడే: గత అయిదేళ్ల కాలంలో మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పురపాలక సంస్థను తన సొంతానికి వాడుకుని భ్రష్టు పట్టించారని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధా కృష్ణ ధ్వజమెత్తారు. శనివారం స్థానిక కూటమి పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసిన ఆయన మాట్లాడారు. పాలక మండలి లేని సమయంలో పురపాలికను తన జేబు సంస్థగా వాడుకున్నారని మండిపడ్డారు. జీతాలు ఒక చోట.. పనులు మరోచోట అన్న చందాన మంత్రి పాలన సాగించారన్నారు. పురపాలక సంఘానికి చెందిన 11 మంది సిబ్బందిని అయిదేళ్ల పాటు తన సొంతానికి వాడుకుని, వారి జీతాలు మాత్రం పురపాలక సంఘంలో చెల్లించడం దుర్మార్గమన్నారు. ఒక్కొక్కరికి రూ.18,000 నుంచి రూ.21 వేల వరకు జీతాలు చెల్లించారన్నారు. అయిదేళ్ల కాలంలో పురపాలక సంఘం నుంచి రూ.1.18 కోట్లు కారుమూరి ఇంట్లో పనిచేసే సిబ్బందికి వెళ్లిందన్నారు. అధికార మదంతో ఎవరూ తనను ప్రశ్నించరని కారుమూరి వ్యవహరించారని విమర్శించారు. అలాగే మాజీ మంత్రి కారుమూరి వద్ద పీఏగా పని చేసిన వ్యక్తితో పాటు మరొకరు కూడా ఇంజినీరింగ్ విభాగంలో ఐదేళ్లపాటు జీతం తీసుకున్నారని వివరించారు. ఇలాంటి దోపిడీలు చేసిన మాజీ మంత్రి తణుకు ప్రజలకు క్షమాపణలు చెప్పి లెంపలు వేసుకోవాలన్నారు.

రాష్ట్రస్థాయి బాస్కెట్‌బాల్ పోటీలకు జట్ల ఎంపిక



అండర్-14, 17 బాస్కెట్‌బాల్ జిల్లా జట్లుతో పీఈటీలు

మార్టేరు, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం అండర్-14, 17 బాలుర విభాగంలో బాస్కెట్ బాల్ జిల్లా జట్లు ఎంపిక చేశారు. మార్టేరు ఎస్వీజీ క్రీడా ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మలేశ్వరరావు హాజరై పర్యవేక్షణ చేశారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీలకు ఎంపిక చేసిన రెండు జట్లు జిల్లా తరఫున ఆడతాయని నిర్వహణ కార్యదర్శి కృష్ణారెడ్డి తెలిపారు. సుమారు 150 మంది క్రీడాకారులు హాజరు కాగా 34 మందిని ఎంపిక చేశారు.

అండర్ 14 విభాగం

ఈశ్వరప్రసాద్(తాడేపల్లిగూడెం), ఛార్లస్ వెస్లీ(కొవ్వలి), జయశ్రీ సూర్యరెడ్డి(మార్టేరు), ప్రశాంత్(ఉల్లంపర్రు), రిషిలీ(భీమవరం), వేదాంత్(తాడేపల్లిగూడెం), సిద్ధు(అల్లంపురం), రాజేష్(నూతురామన్నపాలెం), అనిష్(తాడేపల్లిగూడెం), మురళీశ్రీ ఆనందరెడ్డి(పెనుగొండ), దినేష్(ఏలూరు), లయకర్(భీమవరం)తోపాటు మరో అయిదుగురిని అదనంగా ఎంపిక చేశారు.

అండర్ 17 విభాగం

కిషోర్(పాలకొల్లు), రాకేష్(ఏలూరు), షీరజ్(మార్టేరు), సాంబసూర్య(మార్టేరు), అనిష్(మార్టేరు), ప్రవీణ్(ఏలూరు), జార్జి(మార్టేరు) వరప్రసాద్(ఏలూరు) వంశీ(ఏలూరు), కిరణ్(తణుకు), ధరణిధర్(భీమవరం), సుశాంత్(పెదతాడేపల్లి)తో పాటు అదనంగా మరో ఐదుగురిని ఎంపిక చేశారు.

అప్పుల బాధతో ఆత్మహత్య

పెదవేగి, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. పెదవేగి మండలం వీరంపాలేనికి చెందిన ఉప్పాల వీరయ్య (52) తన కుమారుడు అనారోగ్యం పాలవడంతో వైద్యం నిమిత్తం అప్పులు చేశారు. కుమారుడికి నయం కాకపోవడంతోపాటు అప్పులు తీర్చే మార్గం లేక ఈ నెల 27న ఇంటి వద్ద పురుగు మందు తాగారు. కుటుంబ సభ్యులు గమనించి చికిత్స నిమిత్తం గుంటూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతి చెందారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ముగ్గురు దొంగల అరెస్టు

రూ.24.99 లక్షల విలువైన బంగారం, వెండి ఆభరణాలు స్వాధీనం



చోరీ సొత్తును పరిశీలిస్తున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

మసీదుసెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఇళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న ముగ్గురు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.24.99 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. 277 గ్రాముల బంగారం, 6 కేజీల వెండి ఆభరణాలను శనివారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ప్రదర్శించి వివరాలు వెల్లడించారు. ఈ ఏడాదిలో జిల్లాలోని ఇంద్రపాలెం, పెదపూడి, తూర్పు గోదావరి జిల్లా బొమ్మూరు, రాజానగరం పోలీసు స్టేషన్ల పరిధిలో ఒక్కోటి చొప్పున నాలుగు ఇళ్లలో చోరీలకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు వివరించారు. ఆయా కేసుల్లో కాకినాడ రామకృష్ణారావుపేటలో ఉంటున్న ఏలూరు జిల్లా వంగాయగూడెం గాంధీకాలనీకి చెందిన ఇసుకలేటి మోజెస్ (30) ఏ1, రాజమహేంద్రవరం గణేష్‌నగర్‌కి చెందిన ఇసుకలేటి గాంధీ (41) ఏ2, రాజేంద్రనగర్‌కి చెందిన తిపర్తి పురుషోత్తమ రామ్‌కుమార్ (32) ఏ3 ప్రధాన నిందితులుగా ఉన్నారని చెప్పారు. వీరిని శనివారం రామకృష్ణారావుపేటలోని మోజెస్ ఇంటిలో అరెస్టుచేసి చోరీ సొత్తుతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ప్రధాన నిందితులు, పాత నేరస్థులైన లైన మోజెస్, గాంధీ వరసకు అన్నదమ్ములని, కాకినాడ, ఏలూరు జిల్లాల్లో రాత్రివేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఎంచుకుని దొంగతనాలు చేస్తారని చెప్పారు. సొత్తును గాంధీకి బావ అయిన రామ్‌కుమార్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తులకు విక్రయించి ఆ సొమ్ముతో జల్సాలు చేస్తారని వెల్లడించారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

ట్రిపుల్ ఐటీలో కార్యశాల

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో శనివారం 'ఇన్నోవేటివ్ సస్టెయినబుల్ గ్లోబల్ ట్రెండ్స్'పై కార్యశాల నిర్వహించారు. ఆచార్యుడు ఆరేపల్లి ఉమామహేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యసించారు. ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కార్యశాలలో మొత్తం 223 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మక శక్తి మరింత పెరుగుతుందన్నారు. దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలు వేగంగా పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య గోపాలరాజు, శ్రావణి, సునీల్ భగత్, విద్యార్థులు పాల్గొన్నారు.

అత్యవసర సమావేశం ఏర్పాటు చేయండి

జడ్పీ సీఈవోకు వైకాపా జడ్పీటీసీ సభ్యుల విన్నపం

ఏలూరు గ్రామీణ, వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లా పరిషత్తు అత్యవసర సమావేశం ఏర్పాటు చేయాలని ఉమ్మడి పశ్చిమ జిల్లా జడ్పీటీసీ సభ్యులు సీఈవో సుబ్బారావుకు శనివారం వినతిపత్రం అందజేశారు. జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ వైకాపా నుంచి ఎన్నికై తెదేపాలో చేరినందున పార్టీ ఫిరాయింపుల చట్టం ప్రకారం ఆమెపై అనర్హత వేటు వేయాలని, దీనికి సంబంధించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. పద్మశ్రీ పదవి నుంచి తొలగించాలని 26 మంది జడ్పీటీసీ సభ్యుల సంతకాలు చేసిన వినతిపత్రాన్ని అయిదుగురు సభ్యులు సీఈవోకు అందజేశారు. అధ్యక్ష పదవికి ఎన్నికైన వారిపై అవిశ్వాస తీర్మానం పెట్టడానికి నాలుగేళ్ల వరకు అవకాశం లేదని, సభ్యులు అందజేసిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు సమర్పిస్తానని సీఈవో తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ చట్టం నిబంధనలు ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

ఏలూరు

● ఏలూరు ● దెందులూరు ● ఉంగుటూరు

కలెక్టరేట్ ఆవరణలో శ్రమదానం


పిచ్చిమొక్కలు తొలగిస్తున్న డీఆర్వో పుష్పమణి, ఉద్యోగులు

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: కలెక్టర్ కార్యాలయ ఆవరణలో శనివారం ఉద్యోగులు శ్రమదానం చేశారు. పలు కార్యాలయాల వద్ద పెరిగిన పిచ్చి మొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. మొక్కలు నాటారు. అనంతరం స్వచ్ఛతాహీ సేవ ప్రతిజ్ఞ చేశారు. డీఆర్వో పుష్పమణి, జడ్పీ సీఈవో సుబ్బారావు, డీఆర్‌డీఏ, డ్వామా పీడీలు విజయరాజు, రాము, నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ ఈఈగా ఇ.సురేంద్రబాబు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

ఏలూరు తూర్పువీధి, న్యూస్‌టుడే

సమస్య: సత్రంపాడు సిద్ధార్థ కళాశాల పక్కన చింతావారి వీధిలోని కాలువల్లో మురుగు పేరుకుపోయింది. రాత్రిళ్లు దోమల బెడద ఎక్కువగా ఉంటోంది. **- ఆర్.రాజ్‌కుమార్, చింతావారివీధి**

సమాధానం: సిబ్బందితో కాలువల్లో పూడిక తీయిస్తాం. **- భానుప్రతాప్, నగర పాలక అధికారి**

సమస్య: ఎన్.ఆర్.పేట జడ్పీ కార్యాలయం ఎదురు రోడ్డులోని కాలువల్లో నెలల తరబడి పూడిక తీయడం లేదు. మురుగు నీరు పారక దుర్వాసన వెదజల్లుతోంది. **- టి.కిశోర్‌బాబు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందితో కాలువల్లో పూడిక తీయిస్తాం. **- బట్టు ఏడుకొండలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

సమస్య: తంగెళ్లమూడి టైటాస్‌నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్దనున్న ప్రధాన మురుగు కాలువలో చెత్తాచెదారం పేరుకుపోయింది. మురుగు పారుదల లేక దుర్వాసనతో పాటు దోమల బెడదతో ఇబ్బందులు పడుతున్నాం. **- సుందరరావు, స్థానికుడు**

సమాధానం: సిబ్బందితో మురుగు కాలువలో చెత్తను తొలగింపజేస్తాం. **- అప్పారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

పెదపాడు, న్యూస్‌టుడే

సమస్య : వసంతవాడ-పెరికీడు ఆర్అండ్‌బీ రహదారిలో అమ్మతలింగంపేట వద్ద ప్రమాదకర గోతులున్నాయి. రాత్రివేళ అవి కనిపించక వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. **- వాహన చోదకులు, వసంతవాడ**

సమాధానం : ఇప్పటికే రహదారికి మరమ్మతులు చేయించాం. ఇటీవల కురిసిన వర్షాలకు మళ్లీ గోతులు పడ్డాయి. వాటిని పరిశీలించి పూడ్చేందుకు చర్యలు తీసుకుంటాం **- శేషుకుమార్, ఆర్అండ్‌బీ ఏఈ, పెదపాడు**

నిధులు కేటాయించినా..

వైకాపా పాలనలో పార్కుల అభివృద్ధికి సాధారణ, అమృత్ నిధుల నుంచి సుమారు రూ.2 కోట్లు కేటాయించారు. అప్పట్లో ఉద్యానాలను అభివృద్ధి చేస్తామని పాలకులు, అధికారులు ప్రకటించారు కానీ పనులు మాత్రం కనిపించడంలేదు. తూతూమంత్రంగా పనులుచేసి చేతులు దులిపేసుకున్నారు. ఆ నిధులు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తెలియదుగానీ నగర ప్రజలకు మాత్రం ఒరిగిందేమీ లేదు. ఆదర్శనగర్, ఆర్ఆర్ పేట, నమస్తే ఇలా అన్ని పార్కులదీ ఇదే పరిస్థితి.

ఉద్యానం.. అధ్వానం

కానరాని పచ్చదనం.. ఆహ్లాదకర వాతావరణం


పాడైన ఆట వస్తువులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే

ఉద్యాన వనాలంటేనే పచ్చదనం.. కాసేపు సేద తీరేందుకు, ఒత్తిళ్ల నుంచి ఉపశమనానికి, ఆహ్లాదకర వాతావరణంలో గడిపేందుకు ప్రజలు పార్కుల్ని ఆశ్రయిస్తుంటారు. కానీ అలాంటి సౌకర్యాలేమీ కనిపించకపోతే ఇంకెక్కడికి వెళతారు. ఇదే ప్రశ్న నగరంలోని చాలా మంది నోటి నుంచి వినిపిస్తోంది. ఉద్యానాలన్నీ అధ్వానంగా మారాయని, కాస్త సేద తీరేందుకూ వీలుకాకుండా ఉన్నాయని ప్రజలు వాపోతున్నారు.


జన్మభూమి పార్కులో సంచరిస్తున్న గేదెలు

జిల్లా కేంద్రం ఏలూరు నగరంలో మొత్తం 15 ఉద్యానాలు ఉండగా.. వాటి అభివృద్ధికి ఏటా నిధులు కేటాయిస్తుంటారు. వాటి ఆలనాపాలనా చూసేందుకు ప్రత్యేకంగా అధికారులు వారి పర్యవేక్షణలో సిబ్బంది పని చేస్తుంటారు. కానీ ఎక్కడా సిబ్బంది కనిపించరు. సంరక్షణను పట్టించుకోరు. మొక్కలు ఎండకు ఎండుతూ ఉండాల్సిందే. పరిసరాలు అధ్వానంగా ఉన్నా వారికి పట్టదు.

దారుణంగా జన్మభూమి..

నగరం నడిబొడ్డున కొత్త బస్టాండు సమీపాన, కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో తమ్మిలేరుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన జన్మభూమి ఉద్యానం కళాకాంతి లేకుండా తయారైంది. ఒకప్పుడు ప్రతిష్ఠాత్మకంగా దీన్ని ఏర్పాటుచేశారు. వాటర్ పాల్స్, మినీ వాకింగ్ ట్రాక్, సేదతీరేందుకు ఆకర్షణీయమైన బెంచీలు, పచ్చని చెట్లు, పక్కనే తమ్మిలేరు.. ఇలా పార్కు ఎంతో అందంగా కనిపించేది. ప్రస్తుతం కళావిహీనంగా మారింది. వైకాపా పాలనలో దీని అభివృద్ధికి రూ.30 లక్షలు కేటాయించారు. ఆ నిధులన్నీ ఏం చేశారో తెలియదు. ఇప్పుడు మొక్కలు లేకుండా చెత్తాచెదారంతో అధ్వానంగా తయారైంది. పార్కులను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తామని నగర కమిషనర్ భానుప్రతాప్ తెలిపారు.


పోటీలను పర్యవేక్షిస్తున్న డీఈవో అబ్రహం

విద్యార్థులకు పోటీలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర - 2024 కార్యక్రమంలో భాగంగా విద్యారంగంలో దార్శనిక ప్రణాళిక తయారు చేయడానికి విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. మండలస్థాయి విజేతలకు శనివారం జిల్లాస్థాయిలో వ్యాస రచన, వక్తృత్వ, డిబేట్ పోటీలను స్థానిక సుబ్బమ్మదేవి పాఠశాలలో నిర్వహించారు. పోటీలను డీఈవో అబ్రహం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే విద్యా సంవత్సరాల్లో విద్యా ప్రణాళికలు ఎలా ఉండాలో విద్యార్థుల నుంచి సేకరించి అక్టోబరు 6వ తేదీలోగా రాష్ట్ర స్థాయికి నివేదించనున్నట్లు తెలిపారు. ఏఎంవో ఆర్.రామారావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యం

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీవో విజయకుమారి అన్నారు. పంచాయతీల్లో శనివారం స్వర్ణాంధ్ర 2047, మన ఇల్లు.. మన గౌరవంపై సమావేశాలు నిర్వహించారు. ఈవోపీఆర్డీ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా: బడేటి


ఎమ్మెల్యే చంటిని సత్కరిస్తున్న సమితి ప్రతినిధులు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: విశ్వబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. పవరుపేటలోని సత్రంలో విశ్వబ్రాహ్మణ పంచాయతుల పరిరక్షణ సమితి జిల్లా కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమం శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంటి మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటానికి విశ్వబ్రాహ్మణులు సహకరించారన్నారు. వారి సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. అనంతరం సమితి నాయకులు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో సమితి నాయకులు వి.దుర్గాప్రసాద్, పి.శివరావు, బి.హరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నగరాభివృద్ధికి మరింత కృషి: మేయర్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఏలూరు నగరాభివృద్ధికి మరింత కృషి చేస్తానని మేయర్ నూర్జహాన్ అన్నారు. మేయర్ జన్మదిన వేడుకలను పవరుపేటలోని ఆమె క్యాంపు కార్యాలయం వద్ద శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బడేటి చంటి హాజరయ్యారు. అందరి సమక్షంలో మేయర్ దంపతులు నూర్జహాన్, ఎస్ఎంఆర్ పెదబాబు కేకు కోశారు. జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి రెడ్డి అప్పల నాయుడు, తెదేపా జిల్లా అధికార ప్రతినిధి ఇసుకపల్లి తాతారావు, నగర కమిషనర్ భానుప్రతాప్, పలువురు కార్పొరేటర్లు, తెదేపా నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్న క్యాంటీనులో ఉచితంగా భోజనాలు ఏర్పాటు చేశారు. కలపర్రు టోల్‌గేటు సమీప అనాథ ఆశ్రమం వద్ద పిల్లలకు దుప్పట్లు పంపిణీ చేశారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం: చింతమనేని


రైతులకు నష్టపరిహారం చెక్కు అందజేస్తున్న ప్రభాకర్

పెదపాడు, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ఏపూరులో శనివారం నిర్వహించిన 'ఇది మంచి ప్రభుత్వం' సభలో ఆయన మాట్లాడారు. వరదలకు నష్టపోయిన రైతులకు రోజుల వ్యవధిలో నష్టపరిహారం అందజేసిన ఘనత కూటమి ప్రభుత్వానిదన్నారు. జనసేన దెందులూరు, గన్నవరం నియోజకవర్గాల సమన్వయకర్తలు ఘంటసాల వెంకటలక్ష్మి, చలమలశెట్టి రమేష్‌బాబు, భాజపా జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ మాట్లాడారు. ముందుగా ఇటీవల వరదలతో మండలంలో నష్టపోయిన 537 మంది రైతులకు రూ.89,72,038 నష్టపరిహారం అందజేశారు. ప్రత్యేక కాదిశరీ, జిల్లా పంచాయతీ అధికారి విశ్వనాథ్ శ్రీనివాస్, తెదేపా మండల అధ్యక్షుడు లావేటి శ్రీనివాసరావు, తెదేపా నేతలు రాంప్రసాద్, శ్రావణి, రజనీశ్, జనసేన నాయకుడు ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం


ఉంగుటూరు: కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేస్తున్న విద్యార్థులు

భీమడోలు, న్యూస్‌టుడే: పరిశుభ్రతతోనే ఆరోగ్యంగా ఉంటామని, పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటి సంరక్షించాలని ఎంఈవో-2 బి.సుధాకర్ అన్నారు. మండలంలోని పూళ్ల, ఎం.ఎం.పురం గ్రామాల్లో శనివారం మన ఇల్లు.. మన గౌరవం, స్వచ్ఛతా హీ సేవ, స్వర్ణాంధ్ర 2047 గ్రామ సభలు నిర్వహించారు. ఆయా గ్రామాల పాఠశాలలను సందర్శించిన ప్రజాప్రతినిధులు, అధికారులు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరు, బాలికలకు ఐరన్ మాత్రలు, రుతు రుమాళ్ల పంపిణీని పరిశీలించారు. సర్పంచి సుజాత తదితరులు పాల్గొన్నారు. ● భీమడోలులోని శ్రీవేంకటేశ్వర డిగ్రీ కళాశాల విద్యార్థులు శనివారం స్వచ్ఛతా హీ సేవ ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాళ్లు బొమ్ము రవికుమార్, ఎ.మాధవి, ఎన్ఎస్ఎస్ అధికారి కె.శివశంకర్, ఎన్ఎస్ఎస్ అధికారి శశికళ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: నారాయణపురంలోని మహాత్మా గాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ బీవీ శ్రీనివాస్ ఆధ్వర్యాన విద్యార్థులు, అధ్యాపకులు కళాశాల ప్రాంగణంలోని చెత్తను తొలగించారు. తరగతి గదులు, ప్రయోగశాలలను శుభ్రం చేశారు.

పరిసరాలు శుభ్రం చేశారు

ఈనాడు కథనాలకు స్పందన

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: నిడమర్రు మండల పరిషత్తు ఉన్నత పాఠశాల, శ్మశాన వాటికల వద్ద చెత్త కుప్పలుగా పేరుకుపోయి అటుగా వెళ్లేవారు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై 'ఈనాడు'లో పలుమార్లు ప్రచురితమైన కథనాలకు ఎట్టకేలకు అధికారులు స్పందించారు. శనివారం ఎంపీడీవో విజయకుమారి ఆధ్వర్యంలో జేసీబీతో చెత్త కుప్పలను తొలగించారు. పరిసరాలను పరిశుభ్రం చేశారు.

నూతన భవనంలోకి రెవెన్యూ కార్యాలయం.. భీమడోలు, న్యూస్‌టుడే: శిథిలావస్థకు చేరిన భీమడోలు మండల రెవెన్యూ కార్యాలయాన్ని శనివారం నూతన భవనంలోకి మార్చారు. భయం భయంగా విధులు పేరిట 'ఈనాడు'లో ఈ నెల 23న వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. ప్రస్తుత కార్యాలయానికి సమీపంలోని సచివాలయం-2 భవనంలోకి మార్చిన కార్యాలయాన్ని తహసీల్దారు బి.రమాదేవి ప్రారంభించారు.

తీగల తొలగింపు.. ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: సత్రంపాడు పాఠశాలకు సమీపంలోని ఓ విద్యుత్తు పవర్లైనుకు పచ్చని తీగలు అల్లుకుని ప్రమాదకరంగా మారాయి. దీనిపై 'నిలువెత్తు నిర్లక్ష్యం' శీర్షికన ఈ నెల 26న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి విద్యుత్తు అధికారులు స్పందించారు. సిబ్బందితో తీగలను తొలగింపజేసి, పరిసరాలను శుభ్రం చేయించారు.


పరుగు పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు

ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి ఎంపికలు

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి గురుకుల బాలుర పాఠశాల మైదానంలో శనివారం పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి జట్ల ఎంపికకు పోటీలు నిర్వహించారు. బాల బాలికలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అండర్-14, 17, 19 విభాగాల్లో బాల బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించినట్లు ఎస్‌జీఎఫ్ దెందులూరు నియోజకవర్గ సమన్వయకర్త కె.రాజ్‌గోపాల్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. పాఠశాల ప్రిన్సిపల్ ఎం.వెంకటేశ్వరరావు, పెదపాడు, పెదవేగి, దెందులూరు, ఏలూరు గ్రామీణ మండలాల సమన్వయకర్తలు కె.శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సురేష్‌కుమార్, శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు.. గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు 24 మంది రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు మూర్తి తెలిపారు. కడపలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. విద్యార్థులతో పాటు శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయిని పద్మావతిని పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఈత పోటీల్లో సత్తా.. కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా స్థాయి ఈత పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారని కైకరం జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం గుళ్ల ప్రసాదరావు శనివారం తెలిపారు. అండర్-14 విభాగంలో ఎస్.సత్య, అండర్ -17లో సీహెచ్ సాయి, ఆర్.భరత్, పి.జశ్వంత్‌లు మొదటి స్థానం సాధించడంతోపాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. విజేతలను హెచ్ఎంతో పాటు పీడీలు పాపాయమ్మ, నాగసుధ అభినందించారు.

'వైఫల్యాలు కప్పిపుచ్చుకోవడానికే లడ్డూ ప్రసాద రాజకీయం'

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి తిరుమల వేంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదాన్ని రాజకీయం చేస్తోందని వైకాపా జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు అన్నారు. వైకాపా అధినేత జగన్ ఆదేశాల మేరకు ఆర్ఆర్‌పేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ జగన్‌కు ప్రజల నుంచి లభిస్తున్న ఆదరణను చంద్రబాబు తట్టుకోలేకపోతున్నారన్నారు. లడ్డూ ప్రసాదంలో కల్తీ విషయమై సీబీఐ, సిట్టింగ్ జడ్జితో విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. వైకాపా నాయకులు కారుమూరి సునీల్, మామిళ్లపల్లి జయప్రకాశ్, నెరుసు చిరంజీవులు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంత యువతకు ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ సంచాలకుడు కె.శశిధర్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఆపై చదివి, 18 నుంచి 45 సంవత్సరాల వయసున్న వారు అర్హులన్నారు. నెల రోజులపాటు ఉచిత భోజన, వసతితో కూడిన శిక్షణ ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన వారు సత్రంపాడులోని తమ సంస్థ కార్యాలయంలో పేర్లు నమోదు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 30 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు.

తొలగించారు... వదిలేశారు



ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఏలూరు పత్తేబాద గంగానమ్మ గుడి సమీపంలోని మ్యాన్‌హోల్ ప్రమాదకరంగా ఉంది. కొద్ది రోజుల కిందట భూగర్భ డ్రెయినేజీని బాగు చేయడానికి దానిపై మూతను తొలగించారు. దాన్ని సరిచేయకుండా వదిలేశారు. ఈ మార్గం మీదుగా ఆదమరిచి ఎవరైనా పయనిస్తే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది. నగర పాలక సంస్థ అధికారులు వెంటనే మ్యాన్‌హోల్‌పై మూతను సరిచేయించాలని స్థానికులు కోరుతున్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదు



గోడ పత్రాలు ప్రదర్శిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: కళాశాలల్లో ర్యాగింగ్‌కు పాల్పడితే శిక్ష తప్పదని ఏలూరు డీఎస్పీ శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. స్థానిక సీఆర్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం 'యాంటీ ర్యాగింగ్'పై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ర్యాగింగ్ అనేది ఒక సామాజిక రుగ్మతగా తయారైందన్నారు. ఇటువంటి వికృత చర్యలు మానుకోవాలని హితవు పలికారు. సామాజిక మాధ్యమాల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం యాంటీ ర్యాగింగ్‌పై ముద్రించిన గోడపత్రాలను ప్రదర్శించారు. కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యుడు వెంకటేశ్వరరావు, ఏలూరు మహిళా పోలీసు స్టేషన్ ఎస్సై కాంతిప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలందిస్తున్న గోగుంట సొసైటీ


మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి మూర్తి

గోగుంట (పెదపాడు), న్యూస్‌టుడే: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో గోగుంట సొసైటీ లాభాల్లో ఉండటంతో పాటు రైతులకు ఉత్తమ సేవలందిస్తోందని ప్రత్యేకాధికారి ఏకేఎన్ఎన్ మూర్తి అన్నారు. శనివారం నిర్వహించిన గోగుంట సొసైటీ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2023-24 ఆర్థిక సంవత్సరం రూ.1,50,98,582 నికర లాభం ఆర్జించిందన్నారు. సభ్యులకు లాభాల్లో 20 శాతం బోనస్ అందజేసినట్లు వివరించారు. ముఖ్య అతిథులుగా సొసైటీ మాజీ ఛైర్మన్లు భావరాజు సత్యనారాయణ, కుటుంబశాస్త్రి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని 248 సొసైటీల్లో గోగుంట సంఘం ప్రథమ స్థానంలో నిలిపిన సిబ్బంది, సభ్యులను అభినందించారు. సభ్యులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు అంకురార్పణ

ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు వైఎంహెచ్ఏ కూడలి వద్ద ముఠా వర్కర్స్ ఆధ్వర్యంలో నిర్వహించే దసరా ఉత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. నిర్వాహకులు రాటను నిలబెట్టి పూజలు చేశారు. లాగుడు బండ్ల హమాలీలు, భక్తులు పాల్గొన్నారు.

అన్నదానం.. ఏలూరు నగరం, న్యూస్‌టుడే: ఏలూరు మోతేవారితోటలోని శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో శనివారం గణనాథుడికి విశేష పూజలు నిర్వహించి అన్నదానం చేశారు. వేలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు.

శిర్డీసాయికి విశేష పూజలు.. నిడమర్రు, న్యూస్‌టుడే: పెదనిండ్రకొలనులో శిర్డీసాయి బాబా జయంతి వేడుకలు శనివారం వైభవంగా నిర్వహించారు. బాబాకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు చేశారు. అన్న సమారాధన నిర్వహించారు. రాత్రి పల్లకీ ఉత్సవం కనుల పండువగా నిర్వహించారు.

బాల వేంకటేశ్వరస్వామికి.. నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే: స్థానిక స్వయంభు శ్రీ బాలవేంకటేశ్వరస్వామిని శనివారం ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

నైపుణ్యాలతోనే ఉపాధి అవకాశాలు

భీమడోలు, న్యూస్‌టుడే: విద్యార్థులు ప్రణాళికాయుతంగా చదివి ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించడంతో పాటు నైపుణ్యాలు మెరుగుపరచుకుంటేనే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రాంతీయ ఉపాధి కల్పనాధికారి రామ్మోహనరావు అన్నారు. భీమడోలులోని గీతాంజలి జూనియర్, డిగ్రీ కళాశాలలో సెట్‌వెల్ ఆధ్వర్యంలో శనివారం వ్యక్తిత్వ వికాసం, కెరీర్ గైడెన్స్‌పై కార్యశాల నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సెట్‌వెల్ సీఈవో ప్రభాకర్ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందని, విద్యార్థి జీవితాన్ని బాధ్యతాయుతంగా తీర్చిదిద్దుకోవాలన్నారు. జిల్లా ఉపాధి అధికారి మధుభూషణరావు మాట్లాడుతూ ఇంటర్, డిగ్రీ విద్యార్హతలతో కళాశాలల స్థాయిలో అక్టోబరులో ఉద్యోగ మేళా నిర్వహిస్తామన్నారు. సెట్‌వెల్ మేనేజర్ సత్యనారాయణ, జిల్లా కెరీర్ కోఆర్డినేటర్ ప్రవీణ్‌కృష్ణ, కిశోర్‌రెడ్డి, జాన్‌కెనడీ, కళాశాల కరస్పాండెంట్ ఎం.గౌతమ్‌కుమార్, ప్రిన్సిపల్ సత్యనారాయణ, ఉదయ్‌కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా పూజలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తితిదేలో లడ్డూ ప్రసాదాన్ని కల్తీ చేసిన వారిని శిక్షించాలని, తిరుమల పవిత్రతను కాపాడాలని జనసేన నాయకుడు నారా శేషు కోరారు. జనసేన అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత దీక్షకు సంఘీభావంగా నారా శేషు ఆధ్వర్యంలో ఏలూరు జూట్‌మిల్లు సమీపంలోని ధర్మభేరి ప్రాంగణంలో వారం రోజుల పాటు నిర్వహించే పూజా కార్యక్రమాలు శనివారం ప్రారంభమయ్యాయి. స్వామికి సహస్ర నామార్చన చేశారు. జనసేన నాయకులు, వీర మహిళలు కొందరు ద్వారకాతిరుమలలో శుక్రవారం గోవింద మాలలు ధరించారు. వారు ధర్మభేరి ప్రాంగణంలో నిర్వహించిన పూజల్లో పాల్గొన్నారు.

విద్యార్థులకు బస్సు పాస్‌ల పంపిణీ

నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: నారాయణపురం జడ్పీ ఉన్నత పాఠశాలకు సమీప గ్రామాల నుంచి వచ్చే 200 మంది విద్యార్థులకు వ్యాపారవేత్త బళ్ల త్రిమూర్తులు ఆర్థిక సహకారంతో ఆర్టీసీ బస్సు పాస్‌లు సమకూర్చారు. పాఠశాలలో శనివారం జరిగిన కార్యక్రమంలో తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ సత్యనారాయణమూర్తితో కలిసి మావనత సంస్థ ఉంగుటూరు మండల శాఖ అధ్యక్షుడు రంగరాజు వాటిని విద్యార్థులకు పంపిణీ చేశారు. దాత త్రిమూర్తులను సత్కరించారు. హెచ్ఎం నాగూర్ మీరా సాహెబ్, ఎస్ఎంసీ కమిటీ ఛైర్మన్ సంధ్యారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వివాహిత మృతిపై కేసు నమోదు

పెదవేగి, న్యూస్‌టుడే: వివాహిత మృతిపై శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. కొప్పాక గ్రామానికి చెందిన కూనాతి ఆదిలక్ష్మి(40) ఈ నెల 27న ఇంటి వద్ద పురుగు మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఏలూరు సర్వజన ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందింది. ఆమె మృతిపై సోదరుడు మత్తే రాంబాబు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఆదిలక్ష్మికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బంగారు నగలు అపహరణ.. ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: బంగారు నగలు అపహరణపై ఏలూరు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో శనివారం రాత్రి కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అశోక్ నగర్ మిలటరీ క్యాంపు సమీపంలో నివాసముంటున్న శ్రీనివాసరావు శనివారం తన సోదరి ఇంట్లో శుభకార్యానికి వెళ్లేందుకు ఓ బ్యాగులో 160 గ్రాముల బంగారు నగలు పెట్టి దాచారు. అవి అపహరణకు గురయ్యాయని బాధితుడి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అయిదు ఇసుక ట్రాక్టర్ల స్వాధీనం.. పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి మండలం విజయరాయి, నడిపల్లి గ్రామాల పరిధిలో తమ్మిలేరు నుంచి ఇసుకను తవ్వి అక్రమంగా తరలిస్తున్న అయిదు ట్రాక్టర్లను శుక్రవారం అర్ధరాత్రి స్వాధీనం చేసుకున్నట్లు ఇన్‌ఛార్జి తహసీల్దారు భ్రమరాంబ తెలిపారు.

అవి ఇవి అన్నీ

ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు.. భీమడోలు, న్యూస్‌టుడే: ధాన్యం కొనుగోళ్లకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తహసీల్దారు బి.రమాదేవి తెలిపారు. మండలంలోని 14 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపడతామన్నారు. ఇందుకు రైసు మిల్లర్లతో ఒప్పందాలు పూర్తయ్యాయన్నారు. తొమ్మిది లక్షల వరకు గోనె సంచులు అవసరమవుతాయని, నాలుగు లక్షలు గోదాముల్లో సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులకు సంచులను కేటాయించేందుకు స్థానిక వీఆర్వోలను పర్యవేక్షణాధికారులుగా నియమిస్తున్నామని వివరించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వాగత వేడుకలు.. ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వాగత వేడుకలు నిర్వహించారు. ప్రధానాచార్యుడు గిరిబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు వైద్యుడు డి.సుబ్బారావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ క్రమశిక్షణాయుత జీవనం ఉజ్వల భవిష్యత్తును ఇస్తుందన్నారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో సందడి చేశారు. సీపీడీసీ సభ్యుడు ఎల్.వెంకటేశ్వరరావు, ఉప ప్రధానాచార్యుడు ఎం.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలి.. ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులకు అనారోగ్యానికి గురైన కాలానికి జీతాలు చెల్లించాలని ఆ సంస్థ సీపీఎం శాఖ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం ఏలూరులో నిర్వహించిన ఆ శాఖ మహాసభలో నాయకురాలు అరుణకుమారి మాట్లాడుతూ అనారోగ్యం కారణంగా సెలవులు పెడితే జీతాలందక ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సంస్థలో ఖాళీ కొలువులు భర్తీ చేయాలని కోరారు. ఉద్యోగులు వారాంతపు సెలవులు వాడుకోకుండా అధికారులు వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు.

భద్రాచలానికి బస్సులు నడపాలని వినతి.. ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్య క్షేత్రం భద్రాచలానికి ఏలూరు నుంచి బస్సులు నడపాలని స్వామి వివేకానంద ప్రజా పరిరక్షణ సమితి అధ్యక్షుడు కోలా భాస్కరరావు తదితరులు కోరారు. శనివారం ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఏలూరు నుంచి భద్రాచలానికి బస్సులు నడిపేవారన్నారు. వాటిని రద్దు చేయడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నారన్నారు.



గర్భిణులకు సామూహిక సీమంతాలు.. ఉంగుటూరు, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే ఆరోగ్యం సమకూరుతుందని ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అన్నారు. ఉంగుటూరు సామాజిక భవనంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో శనివారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. తొలుత ఐసీడీఎస్ సిబ్బంది ఏర్పాటు చేసిన స్టాళ్లను ఎంపీడీవో రాజ్‌మనోజ్, సర్పంచి బండారు సింధు పరిశీలించారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు అడపా శోభారాణి, సెక్టారు పర్యవేక్షకులు శ్రీలక్ష్మి, శారదామణి, పంచాయతీ కార్యదర్శి గిరిధర్, ఉప సర్పంచి పాతూరి జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

మంతెనకు అభినందనలు.. ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: తెదేపా పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు మంతెన రామరాజు ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమితులైన సందర్భంగా తెదేపా రాష్ట్ర కార్యదర్శి, భీమవరం నియోజకవర్గ పరిశీలకుడు దాసరి ఆంజనేయులు, నాయకులు కోళ్ల నాగేశ్వరరావు, ఏసుపాదం, సీతారాం తదితరులు అభినందనలు తెలిపారు. శనివారం చినఅమిరంలోని స్వగృహం వద్ద ఆయనను కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సత్కరించారు.

పత్సమట్లను కలిసిన జడ్పీ ఛైర్‌పర్సన్.. నారాయణపురం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును నారాయణపురంలోని క్యాంపు కార్యాలయంలో జడ్పీ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను సత్కరించి మొక్క అందజేశారు. పద్మశ్రీ, ప్రసాద్ దంపతులు ఇటీవల వైకాపాను వీడి తెదేపాలో చేరిన విషయం తెలిసిందే.

పోలవరం
•పోలవరం •చింతలపూడి

పారిజాతగిరిలో పవిత్రోత్సవాలు



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: గోకుల తిరుమల పారిజాతగిరిలో నిర్వహిస్తున్న పవిత్రోత్సవాల్లో రెండో రోజు శనివారం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పవిత్రాలకు విశేష పూజలు, ఆలయంలో హోమాలు నిర్వహించినట్లు చెప్పారు. శ్రీవారిని దర్శించేందుకు భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. భక్తుల విరాళంతో అన్నదానం చేశారు.

ప్రకృతి వనరులు, శిక్షణ కేంద్రం పరిశీలన



పరిశీలిస్తున్న ఢిల్లీరావు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: గుండుగొలనుకుంట సుబ్రహ్మణ్యేశ్వర ప్రకృతి వనరులు, శిక్షణ కేంద్రాన్ని రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ ఢిల్లీరావు శనివారం సందర్శించారు. కషాయాలు, జీవామృతం, ద్రవజీవామృతం తయారీ విధానాన్ని ఏలూరు జిల్లా వ్యవసాయాధికారి హబీబ్ బాషా వివరించారు. కేంద్రం నిర్వాహకుడు ఐబిలిశెట్టి గోపాలకృష్ణ, ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ఢిల్లీరావు ప్రశంసించారు. అధికారులు వెంకటేష్, ఉషారాణీకుమారి, దుర్గారమేష్ పాల్గొన్నారు.

ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రాజుపోతేపల్లిలో సుమారు రూ.50 లక్షలతో నిర్మిస్తున్న రామాలయానికి వరంగల్ నుంచి సుమారు 70 టన్నుల బరువు ఉండే ఏకశిల ధ్వజస్తంభాన్ని భక్తులు తీసుకొచ్చారు. గ్రామంలో ఊరేగింది శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో..

పోలవరం, న్యూస్‌టుడే: గూటాల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఏకాదశి శనివారాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు వేణుగోపాలాచార్యులు తెలిపారు. మహిళలు విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు.

శ్రీవారి క్షేత్రంలో తనిఖీలు

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయంలో బాంబ్, డాగ్ స్క్వాడ్ తనిఖీలు శనివారం నిర్వహించారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా ఈ తనిఖీలు చేశారు. కొండ పైన ఆలయ పరిసరాల్లో, దర్శన క్యూలు, ప్రసాదాల కౌంటర్లు, ఆలయ నాలుగు గోపురాలు, షాపింగ్ కాంప్లెక్స్, భక్తులు సెల్ ఫోన్లు భద్రపరచే ప్రదేశం, అగరబత్తీలు, దూప్‌స్టిక్స్ విక్రయించే ప్రాంతంలో తనిఖీలు నిర్వహించారు.

కలల గూడు సాకారం వైపు అడుగులు!

ప్రభుత్వ నిర్ణయంతో లబ్ధిదారుల్లో చిగురిస్తున్న ఆశలు

టి.నరసాపురం, న్యూస్‌టుడే

పేదోడి సొంతింటి కలకు గత ప్రభుత్వం మధ్యలోనే అడ్డుకట్ట వేసింది. అప్పట్లో పనులు ప్రారంభించిన లబ్ధిదారులకు నిధులు మంజూరు కాకపోవడంతో అసంపూర్తిగా ఆపేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడి.. గృహ నిర్మాణంపై దృష్టిపెట్టడంతో వారిలో ఆశలు చిగురిస్తున్నాయి.

గతంలో ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణ పథకంలో పోలవరం నియోజకవర్గంలో సుమారు 2,822 మందికి ఇళ్లు మంజూరయ్యాయి. ఎస్సీ, ఎస్టీలకు రూ.2 లక్షలు చొప్పున, మిగిలిన వారికి రూ.1.50 లక్షలు చొప్పున అప్పటి తెదేపా ప్రభుత్వం మంజూరు చేసింది. ఆనందంతో లబ్ధిదారులంతా పనులు ప్రారంభించారు. అనంతరం 2019లో వచ్చిన వైకాపా ప్రభుత్వం ఆ నిధులను నిలుపుదల చేయడంతో ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. దాంతో చేసేది లేక కొందరు అప్పులు చేసి దాదాపుగా పనులు పూర్తి చేశారు. ప్రస్తుతం ఎన్డీయే ప్రభుత్వం లబ్ధిదారుల గృహాల పరిశీలన, జాబితా తయారు చేయాలని గృహ నిర్మాణ సంస్థను ఆదేశించడంతో జాబితా తయారీలో సిబ్బంది నిమగ్నమయ్యారు.



వెలగపాడులో అప్పు చేసి నిర్మించుకున్న ఇల్లు

వివరాలు ఇలా..

మండలం	లబ్ధిదారుల సంఖ్య	చెల్లించాల్సిన నగదు(రూ.కోట్లు)
టి.నరసాపురం	858	3.37
కొయ్యలగూడెం	666	2.70
బుట్టాయిగూడెం	631	2.42
పోలవరం	242	1.29
కుక్కునూరు	233	1.05
వేలేరుపాడు	94	0.54
జీలుగుమిల్లి	98	0.42



బొర్రంపాలెంలో శ్లాబు స్థాయిలో నిలిచిన పనులు

మిగిలిన నిధులు ఇస్తే పూర్తి చేసుకుంటాం

'ఏడేళ్ల కిందట మాకు ఇల్లు మంజూరైంది. అప్పటి ప్రభుత్వం రూ.60వేల వరకు ఇవ్వడంతో గోడల వరకు నిర్మించుకున్నాం. అనంతరం వైకాపా సర్కారు నిధులు నిలిపి వేయడంతో శ్లాబు స్థాయిలో ఆగిపోయింది. ఈ ప్రభుత్వం మిగిలిన నిధులు ఇస్తే ఇంటి నిర్మాణం పూర్తి చేసుకుంటాం'అని బొర్రంపాలేనికి చెందిన నిట్టా చిలకమ్మ కోరారు.

జాబితాలు తయారు చేస్తున్నాం

గతంలో 2016-20 మధ్య ఇళ్ల నిర్మాణం ప్రారంభించి మధ్యలో నిలిచిన, పూరైన వాటిని పరిశీలించి, జాబితా తయారు చేస్తున్నాం. బకాయి నిధులు రాగానే లబ్ధిదారులకు అందజేస్తాం. అప్పట్లో పునాది స్థాయిలో బిల్లు పొంది నిలిచిన ఇళ్లకు కూడా కొత్త పథకంలో నిర్మించుకోవడానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది' అని పోలవరం గృహ నిర్మాణ సంస్థ డీఈ సువర్ణరాజు తెలిపారు.

తొమ్మిది గంటల సరఫరా నిరంతరాయంగా ఇవ్వాలి



కొయ్యలగూడెం (గ్రామీణ, న్యూస్‌టుడే: ఆరిపాటిదిబ్బలు విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వ్యవసాయ విద్యుత్తు తొమ్మిది గంటల పాటు నిరంతరాయంగా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. యర్రంపేటలో పలువురు రైతులు శనివారం ఆందోళన చేశారు. ఉపకేంద్రం పరిధిలోని ప్రాంతాల్లో విడతల వారీ విధానంలో సరఫరా జరగడంతో సాగునీటికి ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షాభావ పొగాకు నారుమడులకు సక్రమంగా నీరు అందడం లేదన్నారు. కొయ్యలగూడెం విద్యుత్తు సబ్‌డివిజన్ ఏడీ గోపాలకృష్ణ మాట్లాడుతూ [illegible] నిరంతరాయంగా సరఫరా ఇవ్వాలన్నారు. కొద్దిరోజులుగా ఎండలు పెరిగి వినియోగం పెరగడంతో అల్పవిద్యుత్తు సమస్య తలెత్తింది. దీంతో విడతల వారీగా సరఫరా చేస్తున్నామన్నారు. వర్షాలు పడితే పరిస్థితి మెరుగుపడుతుందన్నారు. రైతుల డిమాండ్ దృష్టిలో ఉంచుకుని నిరంతరాయ సరఫరాను పునరుద్ధరిస్తామని చెప్పారు. నాయకులు చెరుకూరి గోపాలరావు, మార్ని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఇస్రో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న స్పేస్ ఆన్‌వీల్స్ బస్సు ప్రదర్శన ద్వారా విద్యార్థులకు అంతరిక్ష పరిజ్ఞానం కలుగుతోందని మండల విద్యాశాఖాధికారి-2 రాములు పేర్కొన్నారు. స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలకు ఇస్రో బస్సు శనివారం వచ్చింది. అందులోని అంతరిక్ష రాకెట్లు, ప్రయోగాల నమూనాలను విద్యార్థులు తిలకించారు.

సత్వర వైద్య సేవలందించండి



వైద్యాధికారులతో చర్చిస్తున్న రోషన్‌కుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే రోగులు ఇబ్బందులు పడకుండా వారికి సత్వర వైద్య సేవలు అందించాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. చింతలపూడి ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వంద పడకల ఆసుపత్రిని వీలైనంత త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపడతామన్నారు. రోగుల విషయంలో వైద్యులు మానవతా దృక్పథంతో వ్యవహరించాలన్నారు. సూపరింటెండెంట్ నారాయణరావు, కమిటీ సభ్యులు దేవా, భారతి పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళాలు.. చింతలపూడి, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం జనసేన పార్టీ తరపున చీదరాల మధుబాబు ఆధ్వర్యంలో స్థానిక క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్‌కు శనివారం రూ.లక్ష విరాళం చెక్ రూపంలో అందజేశారు. ● పట్టాయిగూడేనికి చెందిన సూరపనేని నాయనబాబు, రంగనాథ్‌లు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.50వేల చెక్‌ను ఎమ్మెల్యే రోషన్‌కుమర్‌కు అందజేశారు.

ఎన్డీయే ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

జీలుగుమిల్లి, న్యూస్‌టుడే: ఎన్డీయే ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు అన్నారు. జీలుగుమిల్లిలో శనివారం నిర్వహించిన సమావేశంలో బొరగాన్ని కూటమి నేతలు ఘనంగా సత్కరించారు. సంక్షేమ పథకాలను అర్హులందరికీ అందేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సుంకవల్లి సాయి, ఉండవల్లి సోమసుందరం, బాసిన రాజబాబు, గుడెల్లి లక్ష్మీనారాయణ, చిర్రి వెంకటేశ్వరరావు, నాలి శ్రీను పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి



రాజుపోతేపల్లిలో మాట్లాడుతున్న చలపతిరావు

లింగపాలెం, న్యూస్‌టుడే: గృహ నిర్మాణ పథకంపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి.. పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అధికారులకు సూచించారు. లింగపాలెం మండలం వేములపల్లిలో 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో సర్పంచి దివ్యదీప్తి, చలపతిరావు, శ్రీనివాసరావు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కామవరపుకోట (జంగారెడ్డిగూడెం), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఇచ్చిన గడువు లోగా లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకోవాలని తెదేపా మండల అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ అన్నారు. కామవరపుకోట మండలం గుంటుపల్లి పంచాయతీలో 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. కామవరపుకోటలో జరిగిన సభలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళీ పాల్గొన్నారు. మండలంలోని 15 పంచాయతీల్లో సదస్సులు నిర్వహించినట్లు ఎంపీడీవో శ్రీదేవి తెలిపారు.

పోలవరం, న్యూస్‌టుడే: మండలంలోని 11 పంచాయతీల్లో 'మన ఇల్లు.. మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. పోలవరంలో సర్పంచి పొదుం పుష్ప అధ్యక్షత వహించారు.

కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: సీతంపేటలో 'మన ఇల్లు మన గౌరవం' గ్రామ సభ నిర్వహించారు. గృహ నిర్మాణ సంస్థ ఏఈ సతీష్ తదితరులు నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. సర్పంచి తోటకూర పద్మావతి, నాయకులు అల్లం సత్తిరాజు, నారాయణరావు, రాజేశ్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: లక్ష్ముడుగూడెం, మంగయ్యపాలెం, జైనవారిగూడెం గ్రామాల్లో 'మన ఇల్లు-మన గౌరవం' కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 1870 గృహాలు మంజూరు కాగా.. 500 పూర్తయినట్లు గృహ నిర్మాణ సంస్థ మండల ఏఈ పంపన మణికంఠ తెలిపారు. సర్పంచులు మడకం రామలక్ష్మి, తాటి సీత, మాల్చి వెంకన్నబాబు పాల్గొన్నారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: అర్హులకు ఇళ్లు నిర్మించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని మాజీ ఎంపీపీ శీలం వెంకటేశ్వరరావు, జిల్లా ప్రాదేశిక మాజీ సభ్యుడు నల్లూరి చలపతిరావు అన్నారు. టి.నరసాపురం, వెలగపాడు, రాజుపోతేపల్లి, బొర్రంపాలెం, బండివారిగూడెం, ఏపీగుంట తదితర గ్రామ పంచాయతీల్లో 'మన ఇల్లు-మన గౌరవం' గ్రామ సభలు నిర్వహించారు.

సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతల స్వీకరణ



భూషణం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం సబ్ రిజిస్ట్రార్‌గా ఎం.భూషణం శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆయన పాలకొల్లు నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. జంగారెడ్డిగూడెంలో పనిచేసిన జగన్మోహనరావు వేగేశ్వరపురానికి బదిలీ అయ్యారు.

జంగారెడ్డిగూడెం ఎంవీఐగా..



రంగనాయకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మోటారు వాహన తనిఖీ అధికారిగా ఎస్ఎస్ రంగనాయకులు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన రాజమహేంద్రవరం నుంచి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేసిన శివప్రసాద్ కొవ్వూరుకు బదిలీ అయ్యారు.

ఇన్‌ఛార్జి డీటీసీగా మదని.. జంగారెడ్డిగూడెం ఆర్టీవో మదని ఇన్‌ఛార్జి డీటీసీగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఏలూరు డీటీసీ శాంతకుమారి ఇటీవల బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో నియమితులైన కరీం ఇంకా విధుల్లో చేరలేదు. దీంతో జంగారెడ్డిగూడెం ఆర్టీవో మదని ఇన్‌ఛార్జిగా వ్యవహరిస్తున్నారు.

సీపీఐ బలోపేతానికి కృషి

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: గ్రామ స్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. చింతలపూడి మండలం యర్రగుంటపల్లిలో సీపీఐ, రైతు సంఘం నాయకులు శనివారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో మోదీ ప్రభుత్వం రాష్ట్ర సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు సోమశేఖర్, గురవయ్య, సుబ్బారావు, శ్రీను, బాబు, రైతుసంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించాలని వినతి

కుక్కునూరు, వేలేరుపాడు న్యూస్‌టుడే: పోలవరం నిర్వాసితుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యే చిర్రి బాలరాజును విలీన మండలాల జనసేన నాయకులు కోరారు. శనివారం ఆయన్ని క్యాంపు కార్యాలయంలో కలిసి చర్చించారు. ప్రధానంగా 2006-09 మధ్య జరిగిన భూసేకరణలో రైతులు భారీగా నష్టపోయారన్నారు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం ఎకరాకు కేవలం 1.15 లక్షలు మాత్రమే చెల్లించిందన్నారు. అంత తక్కువ ధరకు భూములు కోల్పోయిన వారికి గత వైకాపా ప్రభుత్వం ఎకరాకు రూ.5 లక్షలు ఇచ్చేలా జీవో ఇచ్చిందన్నారు. కానీ అది అమలు కాలేదన్నారు. అదే విధంగా ప్రతి నిర్వాసిత కుటుంబానికి రూ.6.36 లక్షలు ఉన్న వ్యక్తిగత పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచుతూ జీవో ఇచ్చినా నెరవేరలేదన్నారు. ఆ రెండు జీవోలు అమలయ్యేలా ప్రభుత్వ పెద్దలతో మాట్లాడాలని ఎమ్మెల్యేను కోరారు. నాయకులు యుగంధర్, గోపాలకృష్ణ, రవి, శ్రీను, రఫీ, రాంబాబు, ముబారక్, వెంకన్నబాబు, అర్జా బాబు తదితరులు పాల్గొన్నారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం



రహదారిపై బోల్తా పడిన కలప ట్రాక్టర్

టి.నరసాపురం, న్యూస్‌టుడే: కలప లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ శనివారం సాయంత్రం బొర్రంపాలెంలో బోల్తా పడిన ఘటనలో పెను ప్రమాదం తప్పింది. రహదారిపై ప్రమాదకరంగా ఉన్న గోతిలో ఒక్కసారిగా పడటంతో ప్రయాణికులు, స్థానికులు భయాందోళనకు గురయ్యారు. త్రుటిలో ప్రమాదం తప్పడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

త్యాగధనుడు భగత్‌సింగ్



జంగారెడ్డిగూడెంలో విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: దేశం కోసం ప్రాణాలర్పించిన త్యాగధనుడు భగత్‌సింగ్ అని సీపీఐ మండల కార్యదర్శి జంపన వెంకటరమణ రాజు అన్నారు. భగత్ సింగ్ జయంతి సందర్భంగా సీపీఐ, ఏఐవైఎఫ్, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శనివారం అశ్వారావుపేట రోడ్డులోని ఆయన విగ్రహానికి రమణరాజు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కూనపాముల విఘ్నేశ్, కుంచే వసంతరావు, బాలయేసు, బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. ● కామవరపుకోటలో సీపీఐ, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటం వద్ద సీపీఐ మండల కార్యదర్శి టీవీఎస్ రాజు నివాళులర్పించారు. కార్యక్రమంలో జి.సత్యనారాయణ, తాడిగడప సురేష్ రాజు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడిలో స్వాతంత్ర్య సమరయోధుడు భగత్‌సింగ్ జయంతిని వామపక్షాల నాయకులు, ప్రైవేటు బస్సుల చోదకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు సూర్యకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న నాయకులు

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బూసరాజుపల్లి గిరిజన గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినిపై అసభ్యంగా ప్రవర్తించి, వేధింపులకు పాల్పడిన చిత్రలేఖనం ఉపాధ్యాయుడు మురళీకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆదివాసీ ఐకాస ఆధ్వర్యంలో బుట్టాయగూడెంలో శనివారం ప్రదర్శన చేశారు. అభయాంజనేయస్వామి ఆలయం కూడలి నుంచి నెహ్రూబొమ్మ కూడలి వరకు నినాదాలు చేస్తూ కొనసాగించారు. సంక్షేమ వసతిగృహాల్లో నిరంతరం అధికారుల పర్యవేక్షణ ఉండాలని, బాలికల పాఠశాలల్లో పురుష ఉపాధ్యాయులను తొలగించి, ఉపాధ్యాయినులను నియమించాలని కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఇచ్చిన జువైనల్ జస్టిస్ సర్క్యులర్‌ను రద్దు చేయాలని కోరారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కుర్సం దుర్గారావు, సోదెం ముక్కయ్య, తెల్లం రామకృష్ణ, కారం రాఘవ, ఎస్.రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

జాషువా రచనలు స్ఫూర్తిదాయకం

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: కవి చక్రవర్తి గుర్రం జాషువా రచనలు స్ఫూర్తిని కలిగిస్తాయని కుంతలగూడెం ఎంపీయూపీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాయపూడి వెంకటరమణ పేర్కొన్నారు. ఆ పాఠశాలలో జాషువా జయంతిని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జీవిత విశేషాలు, రచనల గురించి విద్యార్థులకు వివరించారు. చిత్రపటం వద్ద నివాళి అర్పించారు.

'వైఫల్యాలు కప్పిపుచ్చేందుకే లడ్డూ రాజకీయం'

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: వంద రోజుల కూటమి పాలనలో వైఫల్యాలను కప్పిపుచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తిరుమల లడ్డూ రాజకీయం చేస్తున్నారని పోలవరం మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆరోపించారు. అధిష్ఠానం పిలుపు మేరకు వైకాపా ఆధ్వర్యంలో నరసన్నపాలెం వై-కూడలి కనకదుర్గమ్మ ఆలయం వద్ద నిర్వహించిన పాప ప్రక్షాళన దీక్షలో శనివారం ఆయన పాల్గొన్నారు. నాయకులతో కలిసి మోకాళ్లపై నిలబడి అమ్మవారిని ప్రార్థించారు. విజయవాడ వరదలు, సూపర్‌సిక్స్ హామీల అమల్లో ప్రభుత్వం విఫలమైందన్నారు.

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఆధ్వర్యంలో బుట్టాయగూడెం శివాలయంలో పాప ప్రక్షాళన పూజ నిర్వహించారు. కేఆర్‌పురం ఎంపీటీసీ సభ్యుడు గాలి దుర్గారావు, వైకాపా మండల ఉపాధ్యక్షుడు సోదెం సుధాకరరావు వేంకటేశ్వరస్వామికి తలనీలాలు సమర్పించారు.

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వైకాపా ఆధ్వర్యంలో గోకుల తిరుమల పారిజాతగిరికి పలువురు నాయకులు పాదయాత్ర నిర్వహించారు. తిరుపతి లడ్డూ వ్యవహారంపై సీబీఐతో విచారించాలని డిమాండ్ చేశారు. వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, జెట్టి గురునాథరావు, ఛైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అవి ఇవి అన్నీ

జిల్లా కార్యవర్గం ఎంపిక.. కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: సత్యసాయి మంచి నీటి పథకం కార్మిక సంఘం జిల్లా కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు నూతన అధ్యక్షుడు జి.శివ సత్యనారాయణ శనివారం తెలిపారు. గౌరవ అధ్యక్షుడిగా డేగా ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా బొంత వరప్రసాదు, సీహెచ్ పోసిబాబు, ప్రధాన కార్యదర్శిగా ఆచంట సత్యనారాయణ, కోశాధికారిగా పిల్లి నాగవీరబాబు మరికొందరు సభ్యులుగా ఎంపికైనట్లు చెప్పారు.

శరన్నవరాత్రి ఉత్సవాలకు అంకురార్పణ.. బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: బుట్టాయగూడెం త్రిశక్తిపీఠం వద్ద వచ్చే నెల 3 నుంచి నిర్వహించనున్న శరన్నవరాత్రి ఉత్సవాలకు శనివారం అంకురార్పణ చేశారు. పందిరి రాట పాతి ప్రత్యేక పూజలు చేశారు. అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గర్భిణులకు సీమంతం.. కొయ్యలగూడెం, న్యూస్‌టుడే: పోషకాహారంతోనే మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నయోమీ రాణి అన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద శనివారం పరింపూడి సెక్టార్ పరిధిలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాశన చేశారు. బాలింతలకు పోషకాహారం అందజేశారు. ఎన్డీయే నాయకులు జ్యేష్ఠ రామకృష్ణ, మాదేపల్లి శ్రీను, తమ్మిశెట్టి మల్లేశ్వరి, యేపూరి సతీష్ పాల్గొన్నారు.

క్రమబద్ధీకరణ కోరుతూ కార్మికుల ప్రదర్శన.. బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఒప్పంద, పొరుగు సేవల పథకాల కార్మికుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ ఇఫ్టూ ఆధ్వర్యంలో కేఆర్‌పురం గిరిజన సహకార సంస్థ గోదాం వద్ద జట్టు కార్మికులు శనివారం ప్రదర్శన చేశారు. జిల్లా అధ్యక్షుడు కేవీ రమణ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల సమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలన్నారు. నాయకులు కొర్సా కిశోర్, దేవరపల్లి రాజు, మీసాల ఏసు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక



జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన చింతలపూడి నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల్లో జంగారెడ్డిగూడెం ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. చదరంగం అండర్-14లో ఎం.కుషాంక్, వి.ఆద్య, చదరంగం అండర్-17లో ఎం.తన్మయి, ఖోఖో అండర్-14లో వి.సంజన, వి.నిఖిల్, అండర్-17లో ఎస్.హర్ష, ఎస్.భావన్ రెడ్డి జిల్లా పోటీలకు ఎంపికయ్యారు. ఆయా విద్యార్థులను పాఠశాల ఛైర్మన్ మద్దిపాటి చైతన్య, సమన్వయకర్త మహేశ్, ప్రిన్సిపల్ నాగమణి, పీఈటీలు అరుణ్‌కుమార్, రాము, దుర్గారావు తదితరులు అభినందించారు.

యోగా, చదరంగంలో.. కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: పాఠశాల క్రీడల సమాఖ్య ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పోటీల్లో కొయ్యలగూడెం జడ్పీ బాలికోన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థినులు రాణించి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయిని ఉమాదేవి శనివారం తెలిపారు. యోగాసనాల పోటీల్లో అండర్-14 విభాగంలో ఎం.యామినీదేవి, జి.విష్ణుప్రియ, అండర్-17లో బి.గీతాసౌభాగ్య, ఎ.తేజశ్రీ, జి.ప్రసన్న, చదరంగం పోటీల్లో అండర్-14లో ఎ.గౌతమి, అండర్-17లో ఎం.శ్రీలక్ష్మీతులసిలక్ష్మి, వీఎన్ఎల్డీ భవానీ ప్రతిభ కనబర్చారన్నారు.

రామసింగవరం విద్యార్థుల ప్రతిభ

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: రామసింగవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.సమంత, ఎన్.కోటసత్తెమ్మ, బి.నాగచైతన్యలు సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్ అండర్-14 విభాగంలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జయ సుభాకర్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

సకాలంలో శస్త్ర చికిత్స.. తల్లీబిడ్డా క్షేమం!

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఉప్పరిల్లకు చెందిన గర్భిణి కోండ్ల లక్ష్మి శనివారం తెల్లవారుజామున ప్రసవ వేదనతో బాధపడుతుండగా.. కుటుంబీకులు ఆటోలో పులిరాముడుగూడెం పీహెచ్‌సీకి తీసుకొచ్చారు. సిబ్బంది ఆమెకు బీపీ ఎక్కువగా, కాళ్లు ఉబ్బిపోయి ఉండటాన్ని గుర్తించారు. ఆ విషయాన్ని కేఆర్‌పురం ఇన్‌ఛార్జి డిప్యూటీ డీఎంహెచ్‌వో సురేశ్‌కుమార్‌కు చరవాణిలో తెలిపారు. వైద్యులు సమ్మెలో ఉండటంతో అంబులెన్స్‌లో జంగారెడ్డిగూడెం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించి, వైద్యానికి ఏర్పాట్లు చేశారు. అక్కడ ఆమెకు శస్త్రచికిత్స చేయడంతో పండంటి బాబుకు జన్మనిచ్చారని ఆయన తెలిపారు. తల్లీబిడ్డా క్షేమంగా ఉన్నారన్నారు.

నూజివీడు

•నూజివీడు •కైకలూరు

3న ఘాట్ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ఆగిరిపల్లిలోని శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి ఆలయ ఘాట్ రోడ్డు శంకుస్థాపన అక్టోబర్ 3న మంత్రి కొలుసు పార్థసారథి, దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవాదాయశాఖ కమిషనర్ సత్యనారాయణ వైభవంగా నిర్వహించనున్నారు. దీనికి సంబంధించి ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. శోభనాచలుని క్షేత్రం దగ్గర ముళ్ల కంచెలు, రూట్ మ్యాప్‌కు అడ్డంకులను తొలగిస్తున్నారు. డ్రోన్‌తో సర్వే చేస్తూ రూట్ మ్యాప్‌ను గుర్తిస్తున్నారు. శనివారం ఆలయ ఈవో డి.సురేష్‌బాబు, కూటమి నాయకులు ఎం.గోపాల్, మాదల బుజ్జి, విక్టర్‌బాబు, ఎం.శ్రావణ్, కె.కిశోర్, ఎం.మహేశ్, పంచాయతీ రాజ్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన చేస్తున్న సిబ్బంది

కైకలూరు, న్యూస్‌టుడే: పోషక విలువలు కలిగిన ఆహారాన్ని రోజూ తీసుకోవడంతో ఆరోగ్యం మెరుగ్గా ఉంటుందని ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్ ఎం.లావణ్య అన్నారు. పోషకాహార మాసోత్సవాల్లో భాగంగా శనివారం వెలంపేట 16వ వార్డు అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు రక్తహీనతకు గురికాకుండా తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, బాల్యంలో ఉండే పోషకాలపై అవగాహన కల్పించారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు.

ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా రజిత



ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లి సబ్ రిజిస్ట్రార్‌గా శనివారం సి.హెచ్.రజిత బాధ్యతలు స్వీకరించారు. ఆమె మచిలీపట్నం నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న మధుబాబు కృష్ణాజిల్లా కొత్తవరానికి బదిలీపై వెళ్లారు. వి.వీరాస్వామి నిసేవర్, కె.గణేశ్ జూనియర్ అసిస్టెంట్లుగా బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టారు.

(గ్రూపు) దేవాలయాల ఈవోగా శేఖర్



కలిదిండి, న్యూస్‌టుడే: కలిదిండిలోని పాతాళ భోగేశ్వర స్వామి, తాడినాడ సీతారామ స్వామివారి ఆలయాల ఈవోగా వీఎస్‌కే శేఖర్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇంతకుముందు ఇక్కడ ఈవోగా పని చేసిన సింగనపల్లి శ్రీనివాసరావు వడాలిలోని జగన్నాథస్వామి ఆలయానికి బదిలీ అయ్యారు. ఆలయాల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని శేఖర్ పేర్కొన్నారు.

జగనన్న కాలనీలో కరెంట్ కష్టాలు!

మీటర్లు లేక లబ్ధిదారుల అవస్థలు

అధికారుల నిర్లక్ష్యం

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యంతో కాలనీవాసులు చీకట్లో గడపాల్సిన దుస్థితి నెలకొంది. ఈ ఏడాది జనవరిలో విద్యుత్తు కొంత వరకు స్తంభాలు ఏర్పాటు చేసి విద్యుత్తు సరఫరా తీగలు, పరివర్తకాలు అమర్చారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. ఇళ్లకు విద్యుత్తు సౌకర్యం కల్పించడంలో మీనమేషాలు లెక్కిస్తున్నారు. అసలు వీరికి విద్యుత్తు మీటర్లు కేటాయించకుండా నెలల తరబడి గృహ విద్యుత్తు సరఫరా అందించడం లేదు. ఇళ్లు నిర్మించకపోతే పట్టాలు రద్దు చేస్తామని గత ప్రభుత్వం బెదిరించడంతో అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నా విద్యుత్తు వెలుగులు లేక చీకట్లోనే గడపాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


ఏర్పాటు చేసిన నియంత్రిక

కైకలూరు, న్యూస్‌టుడే: పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా జగనన్న కాలనీల్లో నిర్మించిన నివాసాల్లో కనీస మౌలిక వసతులు లేక లబ్ధిదారులు అవస్థలు పడుతున్నారు. అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ వ్యవస్థ ఏర్పాట్లు మాట అటుంచితే విద్యుత్తు సౌకర్యం కల్పించడంలో గత పాలకులు పూర్తిగా విఫలమయ్యారు. అప్పులు చేసి నివాసాలు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను కరెంటు కష్టాలు వెంటాడుతున్నాయి. కైకలూరు మండలం పందిరిపల్లెగూడెం పంచాయతీ పరిధిలోని కొల్లేటికోట జగనన్న కాలనీలో 83 మందికి పట్టాలు మంజూరు చేయగా 40 మంది ఇంటి నిర్మాణాలు చేసుకున్నారు. సుమారు 15 మంది ఇళ్లు పూర్తి చేసుకుని ఏడాది నుంచి నివాసాలు సాగిస్తున్నారు. విద్యుత్తు తీగలు ఏర్పాటు చేసి చాలా కాలం అయినా వాటికి మీటర్లు బిగించకపోవడంతో వారికి అవస్థలు తప్పడంలేదు. ఈ విషయమై విద్యుత్తు ఏడీ రామయ్యను సంప్రదించగా - ఎన్నికల కోడ్ రావడంతో పనులు సగంలో నిలిచాయని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామన్నారు. త్వరలోనే పూర్తిస్థాయిలో సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

మంత్రి దృష్టికి తీసుకువెళ్లాం

ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నా.. విద్యుత్తు సౌకర్యం కల్పించలేదు. ఇటీవల కొల్లేరు ముంపు గ్రామాల్లో పర్యటించిన మంత్రి కొలుసు పార్థసారథి, ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ దృష్టికి సైతం సమస్యను తీసుకువెళ్లాం. వెంటనే వారు విద్యుత్తు డీఎం, ఉన్నతాధికారులతో మాట్లాడారు. కొల్లేరు వరద కూడా తగ్గింది. సమస్యను పరిష్కరిస్తామని ఆసిస్తున్నాం.

- ముంగర శ్రీనివాసరావు

ఎన్నిసార్లు అడిగినా స్పందన లేదు

శాశ్వత నివాసాలు ఏర్పాటు చేసుకున్నా విద్యుత్తు సౌకర్యం కల్పించడం లేదు. మీటర్ల కోసం ఎన్నిసార్లు అడిగినా అధికారులు స్పందించడం లేదు. వృద్ధులు, చిన్నారులతో చీకట్లో అవస్థలు పడుతున్నాం.

- జయమంగళ పుష్ప

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు: 99486 40551	కైకలూరు: 73060 88555
ముసునూరు: 93983 81268	కలిదిండి: 90594 84862

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే

సమస్య: నూజివీడు పట్టణం ఉపాచాల నగర్ పార్కు-1 రహదారి వర్షాలకు గోతులు పడి అధ్వానంగా మారింది. రాకపోకలకు అవస్థలు పడుతున్నాం. - ఎన్.వెంకటేశ్వరరావు, నూజివీడు

సమాధానం: గోతులు పూడ్చి, రహదారిని శుభ్రం చేయిస్తాం. - లక్ష్మీనారాయణ, మున్సిపల్ డీఈఈ

కైకలూరు, న్యూస్‌టుడే

సమస్య: కైకలూరు వైఎస్ఆర్ కాలనీ కరకట్ట మార్గంలో 15 రోజులుగా వీధి దీపాలు సక్రమంగా వెలగడం లేదు. శునకాల బెడద అధికంగా ఉండటంతో చీకట్లో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. - బోస్, కైకలూరు

సమాధానం: వెంటనే వెలగని వీధి దీపాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి సమస్యను పరిష్కరిస్తాం. - వెంకటేశ్వరరావు, పంచాయతీ ఈవో

ముసునూరు, న్యూస్‌టుడే

సమస్య: గోపవరం పాలకేంద్రం వీధిలో మట్టి రోడ్డుతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. కనీసం డ్రెయినేజీ సౌకర్యం లేకపోవడంతో వర్షం కురిసినప్పుడు వీధిలో నీరు నిలిచి బురదమయంగా మారుతోంది. పిల్లలు, పెద్దలు ఆ బురద నీటిలోనే నడుస్తున్నారు. - ఎన్.ఏసుబాబు, గోపవరం

సమాధానం: నిధులు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తాం. - ఆర్.వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి

వరద బాధితులకు చేయూత

ముసునూరు, న్యూస్‌టుడే: విజయవాడ వరద బాధితుల సహాయార్థం ఆదుకునేందుకు తమ వంతు సహాయంగా ముసునూరు మండలం వేల్పుచర్లకు చెందిన తెదేపా నాయకుడు గరికముక్కు నాని శనివారం విజయవాడలో మంత్రి కొలుసు పార్థసారథిని కలిసి ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 వేల చెక్కును అందజేసినట్లు తెలిపారు.

ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం


మాట్లాడుతున్న సంఘ సభ్యులు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: సంఘంగా ఉంటే సాధించలేనిది ఏదీలేదని, పాస్టర్లు సంఘంగా ఏర్పడటం హర్షణీయమని రెవ.డా.పండు మద్దాల అన్నారు. ముదినేపల్లిలోని హోసన్నా విశ్వాస మందిరంలో శనివారం మండల పాస్టర్ల సంఘం ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. ఎవరో వస్తారు ఏదో చేస్తారని కాకుండా సంఘ సభ్యులే ఆపదలో ఉన్నవారికి ఆపన్నహస్తం అందించాలన్నారు. సంఘం మండలాధ్యక్షుడు సుధాకర్ మాట్లాడుతూ.. చర్చి నిర్మాణాలకు, వైద్య ఖర్చులకు, పేదలకు నిత్యావసర సరకులు పంపిణీ వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు.

నూజివీడును సుందరంగా తీర్చిదిద్దుతా: మంత్రి

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతానని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శుక్రవారం రాత్రి నూజివీడు పట్టణ పరిశుభ్రత కోసం రూ.32 లక్షలతో కొనుగోలు చేసిన క్రేన్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్, సిబ్బందితో మంత్రి సమీక్షించారు. పట్టణంలో శానిటేషన్ కార్మికులు ఎంత మంది ఉన్నారు, తాత్కాలిక పద్ధతి, ప్రభుత్వ వాహనాలు, ట్రాక్టర్లు, ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రోజూ పారిశుద్ధ్య పనులు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. రోడ్లపై ఎక్కడా చెత్త లేకుండా ఉదయమే కార్మికులు శుభ్రం చేయాలన్నారు. పూడిక తీసి, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలన్నారు.

కార్యశాలతో ఉపాధి అవకాశాలు


పాల్గొన్న విద్యార్థులు, అధికారులు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ట్రిపుల్ ఐటీలో శనివారం 'ఇన్నోవేటివ్ సస్టెయినబుల్ గ్లోబల్ ట్రెండ్స్'పై కార్యశాల నిర్వహించారు. ఆచార్యుడు ఆరేపల్లి ఉమామహేశ్వర్ ముఖ్య అతిథిగా పాల్గొని ఉపన్యసించారు. ఇన్‌ఛార్జి డైరెక్టర్ అమరేంద్రకుమార్ సదస్సులో వర్చువల్‌గా పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ.. కార్యశాలలో మొత్తం 223 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థుల్లో ప్రతిభ, సృజనాత్మక శక్తి మరింత పెరుగుతుందన్నారు. దేశ విదేశాల్లో ఉపాధి అవకాశాలు వేగంగా పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆచార్య గోపాలరాజు, శ్రావణి, సునీల్ భగత్, విద్యార్థులు పాల్గొన్నారు.

కోళ్ల పెంపకంతో ఆర్థిక స్వావలంబన

కలిదిండి, న్యూస్‌టుడే: కోళ్ల పెంపకంతో మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించవచ్చని జడ్పీటీసీ మాజీ సభ్యురాలు నున్న రమాదేవి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు లంకా రత్నారావు, మాజీ సర్పంచి మంతెన సుబ్బరాజు అన్నారు. కోరుకొల్లు, కలిదిండి, భాస్కరరావుపేటలో శనివారం డ్వాక్రా మహిళలకు పెరటి కోళ్ల పంపిణీ చేశారు. ఇన్‌ఛార్జి ఏపీఎం చిన్నం రవికుమార్, కూటమి నాయకులు పోకల దుర్గాప్రసాద్, నున్న సుబ్రమణ్యం, యలవర్తి వెంకటేశ్వరరావు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

నూజివీడు పట్టణం: నూజివీడు వెలుగు కార్యాలయంలో స్వయం సహాయక సంఘ మహిళలకు 78 యూనిట్ల పెరటి కోళ్లను ఏపీఎం దయాల రాజాశేఖర్ ఆధ్వర్యంలో తెదేపా మండలాధ్యక్షుడు ముసునూరి వెంకటరాజారావు, అరకోటి సంగీతరావు, రామోజీ, వెలుగు డీటీ సుందరరావు శనివారం పంపిణీ చేశారు.


ఆగిరిపల్లి: పెరటి కోళ్లు అందజేస్తున్న అధికారులు, నాయకులు

ఆగిరిపల్లి: ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం, ఏపీఎం బి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఆగిరిపల్లి వెలుగు కార్యాలయం దగ్గర స్వయం సహాయ సంఘాల్లోని మహిళలకు 130 యూనిట్ల పెరటి కోళ్లను, వాటి సంరక్షణకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. సర్పంచి లక్ష్మీవిక్టర్‌బాబు, ఎం.శ్రావణ్, కె.కిశోర్, ఎ.శ్రీనివాసరావు, పి.నరసయ్య, ఏవో పి.చెన్నారావు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి

ముసునూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి ప్రజాస్వామ్య పరిరక్షణ ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యమని తెదేపా మండల అధ్యక్షుడు దేవినేని ఢలారాం అన్నారు. శనివారం ముసునూరులో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ అధ్యక్షుడు పాకనాటి ఆంజనేయులు, తలకొండ సాంబశివరావు, మంగిశెట్టి పవన్, నల్లిబోయిన రాంబాబు, మద్దాల జాన్ తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ చేస్తున్న విశ్రాంత ఎస్పీ చక్రపాణి, భక్తులు

సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత

కలిదిండి, న్యూస్‌టుడే: తిరుమల పవిత్రత, సనాతన ధర్మ పరిరక్షణ అందరి బాధ్యత అని విశ్రాంత ఎస్పీ చన్నంశెట్టి చక్రపాణి అన్నారు. కోరుకొల్లులోని వేంకటేశ్వరస్వామి, కార్యసిద్ధి దత్త సాయి మందిరం, మురళీకృష్ణ ఆశ్రమం ఆధ్వర్యంలో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా వేంకటేశుని ఆలయంలో విశేష పూజలు చేశారు. చన్నంశెట్టి సుబ్రహ్మణ్యం, చన్నంశెట్టి సత్యనారాయణ (కొండ), పూసల చినపుల్లయ్య, గొర్తి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి


ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై కె.శుభశేఖర్ సూచించారు. ఎస్.ఎ.పేటలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు ఇబ్బంది కలిగితే వెంటనే సమీప పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని లేదా 112కు ఫోన్ చేయాలని సూచించారు.



ట్రిపుల్ ఐటీలో యోగా పోటీలు

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని ట్రిపుల్ ఐటీ కళాశాలలో 68వ స్కూల్ ఫెడరేషన్, 19వ బాల బాలికల యోగాసన పోటీలు ఉమ్మడి కృష్ణా జిల్లా అండర్-19 కార్యదర్శి శ్రీమతి రవికాంత ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ పోటీల్లో ట్రిపుల్ ఐటీ పీయూసీ చదువుతున్న విద్యార్థులు అన్ని స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో గెలిచిన విద్యార్థులు త్వరలో అన్నమయ్య జిల్లాలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు. కళాశాల పరిపాలన అధికారి లక్ష్మణరావు, యోగా శిక్షకుడు అక్కినేని సత్యశ్రీధర్, పీయూసీ ఇన్‌ఛార్జి దుర్గాబాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో శనివారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక ఉత్సాహంగా సాగింది. అండర్-14, 16 విభాగాల్లో బాలురు, బాలికలకు వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. ఎనిమిది పాఠశాలల నుంచి విద్యార్థులు పాల్గొని పోటీల్లో సత్తాచాటారు. ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేశారు. ఎంఈవో-2 కె.నరేశ్‌కుమార్, సముదాయ ఛైర్మన్ విజయ్‌కుమార్, పోటీల ఇన్‌ఛార్జి పీడీ కోడే రోజా, వడాలి, గురజ పీడీలు భాస్కర్‌రావు, రత్నారావు, ప్రసాద్, గోదావరి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.


తలపడుతున్న విద్యార్థినులు

నియోజకవర్గ స్థాయి.. నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: నూజివీడు పట్టణంలోని డీఎఆర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో నియోజకవర్గ స్థాయి అథ్లెటిక్స్ పోటీలు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బాలికల ఉన్నత పాఠశాల హెచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. అండర్-14, 17 విభాగంలో బాల బాలికలకు విడివిడిగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వంద మీటర్ల నుంచి మూడు కిలో మీటర్ల పరుగు, లాంగ్ జంప్, హై జంప్ పోటీలు ఉంటాయన్నారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను జిల్లా స్థాయికి ఎంపిక చేస్తామన్నారు. వ్యాయామ ఉపాధ్యాయులు రాణి, సరళ, నాగరాజు, రవీంద్ర, సుగుణ, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, ప్రభాకర్, హారతి తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న మండల స్థాయి ఆటల పోటీలు ముగిశాయి. శనివారం బాలికల ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, షటిల్, టెన్నికాయిట్, యోగా, చెస్ పోటీలను నిర్వహించారు. మండవల్లి మండలంలోని 7 జడ్పీ ఉన్నత పాఠశాలల బాలికలు పాల్గొని ప్రతిభ చూపారు. పీడీ పెరుమాళ్లు, పీఈటీలు వేణుబాబు, హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముసునూరు, న్యూస్‌టుడే: ముసునూరు మండలం వేల్పుచర్ల జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 8 మంది విద్యార్థులు వాలీబాల్, ఖోఖో పోటీలకు, గుడిపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన అయిదుగురు విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఎం.శ్రీనివాస్, వ్యాయామ ఉపాధ్యాయుడు సుకుమార్, గుడిపాడు ప్రధానోపాధ్యాయురాలు నిర్మలాదేవి శనివారం తెలిపారు. ఈనెల 20, 21వ తేదీల్లో అండర్-14, 17 విభాగంలో నియోజకవర్గ స్థాయిలో జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

వెళ్లే వారే కాని వచ్చేవారేరి..?

- తహసీల్దారు, ఎంపీడీవో పోస్టుల ఖాళీ
- మండవల్లి మండలంలో ఇదీ పరిస్థితి



మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండల స్థాయి అధికారులు బదిలీలపై వెళ్తున్న వారే కాని తిరిగి ఇక్కడికి వచ్చేవారు కానరావడం లేదు. నెలల తరబడి ప్రధాన అధికారులు లేకపోవడంతో ఇన్‌ఛార్జులతో మమ అనిపిస్తున్నారు. దీంతో పాలన అస్తవ్యస్తంగా తయారయ్యింది. మండవల్లి తహసీల్దారుగా పని చేసిన సుభానీ ముదినేపల్లికి బదిలీపై వెళ్లి నెల రోజులు గడుస్తున్నా నేటికి కొత్త తహసీల్దారు బాధ్యతలు తీసుకోలేదు. అప్పటి నుంచి డీటీ తహసీల్దారు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇటీవల కొల్లేరుకు వచ్చిన వరదల్లో సైతం తహసీల్దారు లేకపోవడంతో ఇన్‌ఛార్జి తహసీల్దారు మాత్రమే సహాయ చర్యలు చేపట్టారు. మరోపక్క ఎంపీడీవో వెంకటరమణ రెడ్డిగూడేనికి, ఈవోపీఆర్డీ ఆనంద్‌బాబు ఆగిరిపల్లికి బదిలీలపై వెళ్తున్నారు. కానీ మండవల్లికి వచ్చే అధికారుల వివరాలు లేవు.

ప్రజలకు ఇబ్బందులు

మండల కేంద్రంలో ప్రధాన అధికారులు లేకపోవడంతో మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి సమస్య కోసం వస్తున్న ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలియక ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి అధికారుల కోసం నిరీక్షించి తీరా అధికారులు లేకపోవడంతో వెనుతిరుగుతున్నారు. అధికారులుంటేనే పనులు జరుగుతాయని కింది స్థాయి సిబ్బంది చెప్పడంతో రోజుల తరబడి వేచి చూస్తున్నారు.

ఆడింది ఆట పాడిందే పాట

మండల స్థాయి అధికారులు లేకపోవడంతో కింది స్థాయి సిబ్బంది ఆడింది ఆటగాను పాడింది పాటగాను సాగుతోందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా అధికారులు సమయపాలన పాటించడం లేదు. మరోపక్క అడిగే వారే లేకపోవడంతో ఇళ్లకే పరిమితమై పనులను పక్కన పెట్టేస్తున్నారు. గ్రామాల్లో అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్యం, రక్షిత మంచినీరు, చెత్త సమస్యలు వెంటాడుతున్నాయని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఆర్డీవో ఖాజావలిని వివరణ కోరగా త్వరలో నిర్వహించే బదిలీల్లో మండవల్లికి తహసీల్దారును కేటాయిస్తారన్నారు. ఎంపీడీవో, ఈవోపీఆర్డీలో ఎవరో ఒకరు త్వరలోనే బాధ్యతలు స్వీకరిస్తారని తెలిపారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	దేవర
సత్యనారాయణ మినీ	సత్యం సుందరం
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	దేవర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	మత్తు వదలరా 2
ద్వారక సినిమాస్ స్క్రీన్3	దేవర
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	కళింగ
కైకలూరు	
విజయలక్ష్మి జీవి సినిమాస్	దేవర
మాగంటి సినిమాస్	సత్యంశివం
శ్రీవెంకటరమణ సినిమాస్	దేవర
ముదినేపల్లి: పూర్ణిమ	దేవర

మహోన్నత వ్యక్తి జాషువా

మండవల్లి, న్యూస్‌టుడే: సామాజిక రుగ్మతలను ప్రశ్నిస్తూ.. సమాజాన్ని చైతన్యం వైపునకు నడిపించిన మహోన్నత వ్యక్తి గుర్రం జాషువా అని ఆచార్యుడు విజయ్‌కుమార్ అన్నారు. మండవల్లి ప్రధాన సెంటర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం ఆయన జయంతిని నిర్వహించారు. ప్రజలు వివక్షత, తక్కువ ఎక్కువ అనే భావన విడనాడి సంఘటితంగా జీవించాలని కోరారు. అంబేడ్కర్ అసోసియేషన్ సభ్యులు శాంతరాజు ఎల్ఎస్.భాస్కరరావు, అప్పారావు, వరప్రసాద్, గాంధీ విజయ్‌గణేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

మన ఇల్లు-మన గౌరవం


కాట్రేనిపాడు: మాట్లాడుతున్న ఎంపీడీవో రాణి

ముసునూరు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్మిస్తున్న ఇళ్లను లబ్ధిదారులు వచ్చే ఏడాదిలోపు పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో జి.రాణి సూచించారు. శనివారం ముసునూరు మండలం కాట్రేనిపాడులో మన ఇల్లు-మన గౌరవం గ్రామ సభలో పాల్గొని లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. సర్పంచి గద్దెల సుహాసిని, మోహనరావు, సూర్యదేవర శ్రీనివాసరావు, ఎంఈవో సుబ్బారావు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లి, వడాలి సచివాలయాల్లో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాల్లో భాగంగా మన ఇల్లు- మన గౌరవం గ్రామసభలు నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి పి.శ్రీనివాస్, తెదేపా నాయకుడు వీరమల్లు నరసింహారావు, ఎంపీడీవో పి.మల్లీశ్వరి, వీఆర్వో మురళీ, పంచాయతీ కార్యదర్శి సంగమయ్య పాల్గొన్నారు.

కైకలూరు, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకంలో గృహాలు మంజూరైన లబ్ధిదారులు వచ్చే ఏడాది మార్చికల్లా ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని గృహ నిర్మాణ సంస్థ డీఈఈ శేఖర్ అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దానం మేరీ నవరత్నకుమారి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు గృహ నిర్మాణాలపై అవగాహన కల్పించారు. కూటమి నాయకుడు పూల రామచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

మండవల్లి: మండవల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో మన ఇల్లు- మన గౌరవం పేరుతో గ్రామ సభలు నిర్వహించినట్లు ఎంపీడీవో వెంకటరమణ తెలిపారు. అనంతరం ఇది మంచి ప్రభుత్వం, స్వర్ణాంధ్ర-2047, స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలపై అవగాహన కల్పించారు.

ఆగిరిపల్లి: ఇన్‌ఛార్జి ఎంపీడీవో అబ్దుల్ సలాం, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు ఆరేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆగిరిపల్లి మండలంలోని 25 పంచాయతీల్లో శనివారం గ్రామ సభలను నిర్వహించారు.

బడి మరమ్మతులకు చొరవ.. కలిదిండి, న్యూస్‌టుడే: కోట కలిదిండిలో శిథిలావస్థకు చేరిన ప్రాథమిక పాఠశాలకు స్వచ్ఛందంగా మరమ్మతులు చేయిస్తామని రాధ-రంగా మిత్ర మండలి ట్రస్టు సభ్యులు కాళ్లపాలెం బుజ్జి, చిట్టూరి రవీంద్ర, జడ్డు సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం జరిగిన గ్రామ సభలో ఈ మేరకు సర్పంచి మారుతీ ప్రసన్న, కార్యదర్శి ఉదయ్‌కుమార్‌కు లేఖ అందించారు. బడికి సంబంధించిన స్థలాన్ని సర్వే చేయించాలని, ఆ స్థలంలో ఆట పరికరాలు ఏర్పాటు చేస్తామన్నారు.



స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యం


బాలికల మానవహారం

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో స్వర్ణాంధ్ర లక్ష్యంగా బాలికలు శనివారం మానవహారం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వీవీఎన్.సత్యనారాయణ మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతకు ఎంతో ప్రాముఖ్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఒక్కరూ జన్మదినం, కుటుంబసభ్యుల పేరుతో మొక్కలు నాటాలన్నారు.


నూజివీడు: విద్యార్థుల ప్రదర్శన

భరతమాత ముద్దు బిడ్డ భగత్‌సింగ్

కైకలూరు, న్యూస్‌టుడే: పిన్న వయసులో దేశం కోసం ప్రాణాలు వదిలిన భరతమాత ముద్దు బిడ్డ భగత్‌సింగ్ అని తెదేపా మండలాధ్యక్షుడు పెన్మత్స త్రినాథరాజు, తెలుగుయువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పూల రామచంద్రరావు అన్నారు. శనివారం భగత్‌సింగ్ జయంతి సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కైకలూరు పంచాయతీ కార్యాలయంలో సర్పంచి దానం మేరీ నవరత్నకుమారి ఆధ్వర్యంలో భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నూజివీడు పట్టణంలో పలు పాఠశాలల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం చిన్న గాంధీ బొమ్మ కూడలి వద్ద భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పి.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

కైకలూరు, నూజివీడు పట్టణం, న్యూస్‌టుడే: అధిష్ఠానం పిలుపు మేరకు వైకాపా జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, పార్టీ ఏలూరు పార్లమెంట్ సమన్వయకర్త కారుమూరి సునీల్‌కుమార్ నాయకులతో కలిసి శనివారం కైకలూరు మీసాల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రజలు చేశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ✧ నూజివీడు పట్టణంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప అప్పారావు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కలియుగ ప్రత్యక్ష దైవం వేంకటేశ్వరస్వామి విషయంలో రాజకీయాలు తగవన్నారు.

హృద్రోగంతో విద్యార్థి మృతి


నాగముసలయ్య (పాతచిత్రం)

ముసునూరు, న్యూస్‌టుడే: ఏడాది నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్న ఓ బాలుడు ఒక్కసారిగా గుండెపోటుతో మృతి చెందిన ఘటన ముసునూరు మండలం లోపూడిలో జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. ఆ గ్రామానికి చెందిన పోట్రు నరసింహారావు(లేటు), వెంకమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు పెద్ద కుమారుడు నాగముసలయ్య(12) అదే గ్రామంలోని మండల ప్రాథమిక పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. గతేడాది నుంచి గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడి తండ్రి నరసింహారావు ఎనిమిదేళ్ల కిందట మరణించారు. అప్పటి నుంచి ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా బాలుడికి తల్లి వెంకమ్మ కూలి పనులు చేసుకుంటూ వైద్య చేయిస్తూ వచ్చారు. ఒకసారి శస్త్రచికిత్స కూడా చేయించారు. ఆరోగ్యం మెరుగు పడిందని భావించారు. కొంతకాలం నుంచి పాఠశాలకూ యథావిధిగా వెళ్తున్నాడు. శుక్రవారం పాఠశాల నుంచి ఇంటికి వచ్చిన నాగముసలయ్య కొద్దిసేపటి తర్వాత ఛాతీలో నొప్పిగా ఉందని కూర్చున్నాడు. అంతలోనే స్పృహ కోల్పోయాడు. వెంటనే స్థానికులు విజయవాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే బాలుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. బాలుడి తల్లి రోదిస్తున్న తీరు స్థానికులను కలచివేసింది. తెదేపా గ్రామ నాయకులు కుటుంబసభ్యులను పరామర్శించి పార్టీ తరఫున ఆదుకుంటామని భరోసానిచ్చారు.

కారు, వ్యాను ఢీ: నలుగురికి గాయాలు


ప్రమాదంలో నుజ్జయిన కారు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి మండలం కొవ్వాడలంకలో శనివారం త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. ఏలూరు వైపు నుంచి కైకలూరు వైపునకు వస్తున్న కారును కొవ్వాడలంక సెంటర్‌లోని మలుపులో కైకలూరు వైపు నుంచి ఏలూరు వైపునకు చేపల లోడుతో వెళ్తున్న వ్యాను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న మండవల్లి మండలం ఇంగిలిపాకలంక మాజీ సర్పంచి ముంగర శోభనాద్రి, మరో ముగ్గురు కుటుంబ సభ్యులకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఏలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఎవరికి ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపారు.

ఆదర్శప్రాయునికి అశ్రునివాళి



జననం
15-03-1956

మరణం
17-09-2024

శ్రీ వెల్ది రాంబాబు గారు

పోలవరం సొసైటీ మాజీ అధ్యక్షులు

మీ రూపం మా కళ్ళెదుటే ఉంది... మీ మాటలు మాకు వినిపిస్తూనే ఉన్నాయి.
మట్టిని నమ్ముకున్న "మహర్షి" మీరు. వ్యవసాయమే ఊపిరిగా, రైతు బాంధవ్యుడిగా
రైతుల కుటుంబాలతో పాటు మాకొరకు అహర్నిశలు శ్రమించి
మా ఉజ్వల భవిష్యత్తుకు బాటలు వేసిన మహోన్నత వ్యక్తి.
మీరు మా నుండి ఆకస్మికంగా దూరమవడం మాకు తీరనిలోటు.
మీ జ్ఞాపకాలు ఎల్లప్పుడూ మాతోనే ఉంటాయని, మీరు నిత్యము మాతో ఉన్నారని భావిస్తూ...
మీ పవిత్రాత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుని ప్రార్థిస్తున్నాము.

కుటుంబసభ్యులు మరియు బంధుమిత్రులు

పెద్దకర్మ : ది. 29-09-2024 ఆదివారం నాడు నూజివీడు దగ్గర చాట్రాయి మండలం, మర్లపాలెం గ్రామంలోని మా స్వగృహము నందు జరుపబడును. కావున తెలియపరచడమైనది. ఫోన్: 9346911718